తెలుగు దినపత్రిక
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice వార్త పత్రిక
20-05-2026
బుధవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 105
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–



తెలుగు దినపత్రిక
www.siridaily.com
సిరి People's Voice వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
epaper.siridaily.com
**విలేకరులు కావలెను**
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575


# సామజిక మాధ్యమాలపై పై సాక్ఐ

## తెలంగాణ పోలీస్ ఏఐ మానిటరింగ్

- ఇక విద్వేషపూరిత పోస్టులతో జాగర్త
- తప్పడు ప్రచారాలపై డేగకన్ను
- నేర విశ్లేషణకు సాంకేతిక వినియోగం

**తెలంగా బ్యూరో, మే19 సిరిన్యూస్:** తెలంగాణ పోలీసులు సామాజిక మీడియాలో పెరుగుతున్న విద్వేష పూరిత ప్రచారాలను అరికట్టేందుకు సాంకేతికను వాడుతున్నారు. సామజిక మాధ్యమాలలో విచ్చలవిడి

మిగతా 3వ పేజీలో..




## 'పాలమూరు' 90 శాతం

# పూర్తయిందనేది అబద్ధం

- బీఆర్ఎస్పై మంత్రి ఉత్తమ్ తీవ్ర ఆగ్రహం
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష
- 15 రోజుల్లో మరో పూర్తి స్థాయి సమావేశం నిర్వహణ

**హైదరాబాద్, మే19 సిరిన్యూస్::** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. జల సౌధలో జరిగిన ఈ సమావేశంలో పాలమూరు

మిగతా 2వ పేజీలో..





# మిషన్ జూన్ 2...!

## సీఎం రేవంత్‌రెడ్డి మైండ్ గేమ్

- ఎవరికి చాన్స్... ఎవరికి చెక్ ?
- తెలంగాణ కేబినేట్ రేసులో గెలుపెవరిదో ?
- బీసీకి డిప్యూటీ సీఎం ?
- ఢిల్లీ వేదికగా లాబీయింగ్...
- ఇద్దరు మంత్రులకు పదవీ గండం
- సామాజిక సమీకరణాలు, ఆశావహుల వ్యూహాలు
- దక్కితే మంత్రి...లేదంటే కార్పొరేషన్ చైర్మన్

**(ప్రత్యేక ప్రతినిధి - సిరిన్యూస్):** తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకోబోతున్న తరుణంలో రాబోయే రాష్ట్ర అవతరణ దినోత్సవం (జూన్ 2) నాటికి మంత్రివర్గ విస్తరణ, పునర్వ్యవస్థీకరణకు ముహూర్తం ఖరారైందనే వార్తలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. గరిష్ట పరిమితి ప్రకారం క్యాబినెట్‌లో ప్రస్తుతం రెండు ఖాళీలు ఉండగా, కేవలం వాటిని భర్తీ చేయడమే కాకుండా కొందరు మంత్రుల శాఖలను మార్చడం లేదా పనితీరు ఆధారంగా ఇద్దరు మంత్రులను తొలగించే అవకాశం ఉందనే టాక్ గట్టిగా వినిపిస్తోంది. తెలంగాణలో

మిగతా 3వ పేజీలో..



## రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు

# ఘన ఏర్పాట్లు

- పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహణకు అధికారులకు ఆదేశాలు
- గన్‌పార్క్‌లో అమరవీరులకు సీఎం నివాళులు
- ట్రాఫిక్, పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి
- ఈ నెల 25 నుంచి సంయుక్త రిహార్సల్స్ నిర్వహణ

2



## జలమండలిలో భారీ

# అవినీతి బట్టబయలు

- వాటర్ బోర్డ్ జీఎం ఇళ్లపై ఏసీబీ దాడులు
- రూ.1.10 కోట్ల నగదు, కేజీ బంగారం స్వాధీనం
- ఆస్తుల విలువ రూ.100 కోట్ల వరకు ఉండొచ్చని అంచనా

3



# శాస్త్రీయంగా వ్యర్థాల నిర్వహణ

- సుస్థిర పట్టణాభివృద్ధి, సర్క్యులర్ ఎకానమి దిశగా చర్యలు
- బయో ఎరువులు, విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యం
- స్వచ్ఛ భారత్ మిషన్ జాతీయ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి

2

# నిరుద్యోగులకు మరో అవకాశం

- ప్రభుత్వ ఉద్యోగాల గరిష్ఠ వయోపరిమితి 44 ఏళ్లకు పెంపు
- ఏడాది పాటు అన్ని సాధారణ నియామకాల నోటిఫికేషన్లకు వర్తింపు

2





# రైతు నేస్తంలో భూసారంపై దృష్టి

- పచ్చిరొట్ట విత్తనాలు, జిప్సం వాడకంపై అవగాహన
- సబ్సిడీతో రైతులకు ప్రభుత్వం చేయూత
- భూసార పరిరక్షణపై మంత్రి తుమ్మల సూచనలు

2

# సినిమా అవకాశం పేరుతో మోసం



- యువతిపై ఇద్దరు యువకుల అత్యాచారం
- షూటింగ్ ఉందంటూ గదికి తీసుకెళ్లి దారుణం
- నిందితుల కోసం గాలిస్తున్న జూబ్లీహిల్స్ పోలీసులు

3



## మరో ఐదు రోజుల పాటు

# హీట్ వేవ్

- తెలంగాణలో మండుతున్న ఎండలు
- పలు జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ
- ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటే అవకాశం

**హైదరాబాద్, మే 19 సిరిన్యూస్:** తెలంగాణ రాష్ట్రంలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. మండుతున్న ఎండలు, వడగాలులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా హీట్ వేవ్ పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్

మిగతా 2వ పేజీలో..



## న్యాయవ్యవస్థపై

# దుష్ప్రచారం సహించం

- బండి భగీరథ్ కేసు వ్యవహారంలో మరో సిట్ ఏర్పాటు

2

# నిరుద్యోగులకు మరో అవకాశం

- ప్రభుత్వ ఉద్యోగాల గరిష్ఠ వయోపరిమితి 44 ఏళ్లకు పెంపు
- ఏడాది పాటు అన్ని సాధారణ నియామకాల నోటిఫికేషన్లకు వర్తింపు
- ఉద్యోగాల భర్తీ ఆలస్యంతో నష్టపోయిన అభ్యర్థులకు ఊరట

**హైదరాబాద్, మే 19 సిరిన్యూస్:**

తెలంగాణలోని నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో గరిష్ఠ వయోపరిమితిని 34 ఏళ్ల నుంచి 44 ఏళ్లకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సడలింపు వచ్చే ఏడాది వరకు విడుదలయ్యే అన్ని సాధారణ ఉద్యోగ నోటిఫికేషన్లకు వర్తిస్తుందని ప్రభుత్వం వెల్లడించింది.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఈ నిర్ణయం అమల్లోకి వచ్చింది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత వివిధ కారణాలతో ఉద్యోగాల భర్తీ ప్రక్రియల్లో జాప్యం చోటుచేసుకోవడంతో అనేక మంది అభ్యర్థులు వయోపరిమితి దాటిపోయి అవకాశాలు కోల్పోయారు. కరోనా ప్రభావం, నోటిఫికేషన్ల ఆలస్యం కూడా నిరుద్యోగులపై తీవ్ర ప్రభావం చూపిన అంశాలుగా ప్రభుత్వం గుర్తించింది.

నిరుద్యోగ యువత నుంచి పెద్ద ఎత్తున వచ్చిన వినతులను పరిశీలించిన అనంతరం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. కొత్త నిర్ణయంతో ఉద్యోగాలకు సిద్ధమవుతున్న వేలాది మంది అభ్యర్థులకు మళ్లీ అవకాశం లభించనుంది. ముఖ్యంగా చాలా కాలంగా నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థుల్లో ఈ ప్రకటన ఆనందాన్ని నింపింది. రాష్ట్రంలోని వివిధ నియామక సంస్థలు విడుదల చేసే సాధారణ ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలకు ఈ వయో సడలింపు వర్తించనుంది. అయితే శారీరక దారుఢ్యం కీలకంగా ఉండే యూనిఫాం సర్వీసులకు ఈ పెంపు వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది. పోలీస్, ఎక్సైజ్, అగ్నిమాపక, జైళ్లు, అటవీ శాఖల ఉద్యోగాలకు ప్రస్తుతం అమల్లో ఉన్న వయోపరిమితి నిబంధనలే కొనసాగనున్నాయి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో వయోపరిమితి కారణంగా అవకాశాలు కోల్పోయిన అభ్యర్థులకు మరోసారి పోటీ చేసే అవకాశం దక్కనుంది. ఉద్యోగ నియామకాల ప్రక్రియపై కూడా ఈ నిర్ణయం ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి.



# మరో ఐదు రోజుల పాటు హీట్ వేవ్

**మొదటిపేజీ తరువాయి**

వాతావరణ కేంద్రం హెచ్చరించింది. పలు జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేయగా, మిగిలిన ప్రాంతాలకు ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించింది. వాతావరణ శాఖ వివరాల ప్రకారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో తీవ్ర వడగాలులు వీచే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేశారు. అత్యవసర పరిస్థితులు తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు రావొద్దని ప్రజలకు సూచించారు. చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు.

రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో కూడా ఎండల ప్రభావం అధికంగానే కొనసాగుతోంది. ఆరెంజ్ అలెర్ట్ అమల్లో ఉండటంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. రేపటి నుంచి పరిస్థితి మరింత తీవ్రంగా మారే అవకాశముందని, నల్గొండ జిల్లాలో కూడా రెడ్ అలెర్ట్ అమలు చేసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు పైగా నమోదయ్యే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. మధ్యాహ్న సమయంలో బహిరంగ ప్రదేశాల్లో తిరగకుండా ఉండటం, తరచూ నీరు తాగడం, తేలికపాటి ఆహారం తీసుకోవడం, శరీరాన్ని చల్లగా ఉంచుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ఎండల తీవ్రతతో రహదారులపై రాకపోకలు తగ్గిపోయాయి. విద్యుత్ వినియోగం భారీగా పెరగడంతో సరఫరాపై ఒత్తిడి పెరుగుతోంది. రైతులు, కూలీలు, నిర్మాణ రంగ కార్మికులు వంటి బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

రాబోయే ఐదు రోజుల పాటు రాష్ట్రంలో ఇదే పరిస్థితి కొనసాగే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరిస్తుండటంతో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది

# రైతు నేస్తంలో భూసారంపై దృష్టి

**హైదరాబాద్, 19 మే సిరిన్యూస్:**



రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం చేరవేయడంతో పాటు భూసార ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించే లక్ష్యంతో నిర్వహించిన "రైతు నేస్తం" తొంభై రెండో ఎపిసోడ్ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించారు. పచ్చిరొట్ట విత్తనాలు, జిప్సం వినియోగం ద్వారా నేల ఆరోగ్యాన్ని మెరుగుపర్చే అంశాలపై రైతులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు వెయ్యి ఆరు వందల వేదికల ద్వారా వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యంతో రైతులు, వ్యవసాయ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు, జిప్సం ఎరువులను పంపిణీ చేశారు.

భూసార పరిరక్షణలో పచ్చిరొట్ట పంటలు కీలక పాత్ర పోషిస్తున్నాయని మంత్రి తెలిపారు. భూమిలో సేంద్రియ కర్బనాన్ని పెంచడంలో, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడంలో జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి పంటలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. రైతులకు ఈ విత్తనాలను యాభై శాతం సబ్సిడీపై అందిస్తున్నట్లు వివరించారు. గత వానాకాలంలో ఒక లక్షా ఎనభై తొమ్మిది వేల మంది రైతులకు అరవై ఒకటి కోట్లకు పైగా సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. దీని ద్వారా లక్షల ఎకరాల్లో సాగు జరిగినట్లు తెలిపారు. ఈ ఏడాది మరింత విస్తృత స్థాయిలో పంపిణీ చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

రాష్ట్రంలోని క్షార ప్రభావిత భూముల పునరుద్ధరణ కోసం తొంభై శాతం సబ్సిడీపై జిప్సం ఎరువులు అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే పలు జిల్లాల్లో వేల మెట్రిక్ టన్నుల జిప్సం అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. రైతులు వీటిని వినియోగించుకుని నేల నాణ్యతను మెరుగుపరుచుకోవాలని సూచించారు.

కార్యక్రమం చివర్లో రైతులు అడిగిన సాగు సంబంధిత సందేహాలకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సమాధానాలు ఇచ్చారు. రైతులకు క్షేత్రస్థాయిలో మరింత అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులకు మంత్రి ఆదేశించారు.

# శాస్త్రీయంగా వ్యర్థాల నిర్వహణ

**న్యూఢిల్లీ, మే 19 సిరిన్యూస్::**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ విజన్2047 లక్ష్యాలకు అనుగుణంగా భవిష్యత్ అవసరాలకు సరిపోయే విధంగా సుస్థిరంగా, సమగ్రంగా, పర్యావరణహితంగా రాష్ట్ర అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం క్యూర్, ప్యూర్, రేర్ అభివృద్ధి విధానాన్ని అనుసరిస్తోందని, కోర్ అర్బన్ రీజియన్, పెరి అర్బన్ రీజియన్, రూరల్ అగ్రికల్చరల్ రీజియన్‌ల సమతుల్య అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. దేశవ్యాప్తంగా పట్టణ పరిశుభ్రత, పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ అధ్యక్షతన మంగళవారం ప్రారంభమైన రెండు రోజుల స్వచ్ఛ భారత్ మిషన్‌అర్బన్ 2.0 జాతీయ సమీక్ష సమావేశానికి రాష్ట్రం తరపున ఉప ముఖ్యమంత్రి భట్టి హాజరయ్యారు. మొదటి రోజు సమావేశంలో దేశంలోని పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, ఇంటింట చెత్త సేకరణ, వ్యర్థాల శాస్త్రీయ ప్రాసెసింగ్, పాత చెత్త కుప్పల తొలగింపు, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, పీపీపీ విధానాలు, కొత్త ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనల అమలు వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అమలవుతున్న శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ విధానాలు, సుస్థిర పట్టణాభివృద్ధి చర్యలు, స్వచ్ఛత కార్యక్రమాలు, సర్క్యులర్ ఎకానమీ దిశగా చేపడుతున్న కార్యక్రమాలను ఉప ముఖ్యమంత్రి వివరించారు. ఘన వ్యర్థాల నిర్వహణ అనేది ఇకపై కేవలం చెత్త సేకరణకే పరిమితం కాదని, అది వాతావరణ మార్పులకు ప్రతిస్పందన, పర్యావరణ సుస్థిరత, సర్క్యులర్ ఎకానమీ, ఉపాధి కల్పన, ఆర్థిక ఉత్పాదకతలతో నేరుగా అనుసంధానమై ఉందని భట్టి పేర్కొన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు2026 దేశంలో వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలో కీలక మార్పుకు దారితీస్తున్నాయని తెలిపారు. కొత్త నిబంధనలు సంప్రదాయ చెత్త సేకరణ, డంపింగ్ విధానాలకే పరిమితం కాకుండా 4వే సోర్స్ సెగ్రిగేషన్, వికేంద్రీకృత వ్యర్థాల ప్రాసెసింగ్, పాత డంప్ యార్డుల శాస్త్రీయ శుద్ధి, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ, సర్క్యులర్ ఎకానమీ, వార్డు స్థాయి బాధ్యత, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. నిబంధనలు అమలులోకి రాకముందే తమ రాష్ట్రం ఈ దిశగా పలు చర్యలు ప్రారంభించిందని వివరించారు. రాష్ట్రంలోని కోర్ అర్బన్ ప్రాంతాల్లో దాదాపు 9,596 ఎలక్ట్రిక్ స్వచ్ఛ ఆటో టిప్పర్లను ప్రవేశపెట్టే ప్రక్రియను ప్రభుత్వం చేపడుతోందన్నారు. ఈ ఎలక్ట్రిక్ వాహనాల ద్వారా మున్సిపల్ కార్యకలాపాల్లో కార్బన్ ఉద్గారాలు తగ్గడంతోపాటు, శుభ్రమైన రవాణా విధానానికి మార్గం సుగమం అవుతుందన్నారు. వీటిని 4వే సోర్స్ సెగ్రిగేషన్‌కు అనుగుణంగా విభజిత చెత్త నిల్వ స్థలాలతో రూపొందిస్తున్నట్లు తెలిపారు. క్యూఆర్ కోడ్ ఆధారిత పర్యవేక్షణ ద్వారా ఇంటింట చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా అమలు చేయనున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం వికేంద్రీకృత, పంపిణీ ఆధారిత వ్యర్థాల ప్రాసెసింగ్ వ్యవస్థలకు ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తడి చెత్తను ఉత్పత్తి అయిన ప్రాంతాల సమీపంలోనే ప్రాసెస్ చేయడం, పొడి చెత్తను శాస్త్రీయంగా వేరు చేసి రీసైక్లింగ్, సర్క్యులర్ ఎకానమీ వ్యవస్థల్లోకి తీసుకురావడం, ల్యాండ్‌ఫిల్ ప్రాంతాలకు కనిష్ఠ వ్యర్థాలు మాత్రమే చేరేలా చేయడం ప్రభుత్వ విధానమని వివరించారు. తడి చెత్తను నగరాల్లో దూర ప్రాంతాలకు తరలించడం వ్యయభారంతో కూడుకున్నదిగా ఉండటమే కాక పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా కూడా సుస్థిర విధానం కాదని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. అందుకే వికేంద్రీకృత తడి చెత్త ప్రాసెసింగ్ కేంద్రాల ద్వారా స్థానిక స్థాయిలోనే వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. దీని వల్ల వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్లకు వెళ్లే ఆర్డీఎఫ్ నాణ్యత కూడా మెరుగుపడుతుందని వివరించారు. పాత డంప్‌యార్డుల శాస్త్రీయ శుద్ధి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిన అంశమని, హైదరాబాద్‌లోని జవహర్‌నగర్ డంప్ యార్డ్ విషయంలో ఐఐటీ బాంబే సాంకేతిక సహకారం, సలహా సేవలను పొందుతున్నట్లు తెలిపారు. దీని లక్ష్యం మొక్కుబడి చర్యలకే పరిమితం కాకుండా దీర్ఘకాలిక పర్యావరణ నిర్వహణ వ్యూహాన్ని రూపొందించడం, నిరంతర పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయడమని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అలాగే ఆటోనగర్ డంప్ సైట్‌లో సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 22 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను బయోమైనింగ్ ద్వారా ప్రాసెస్ చేస్తున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న భూమిని మళ్లీ డంపింగ్ కోసం కాక భవిష్యత్తులో పార్కులు, క్రీడా సదుపాయాలు, ప్రజా వినియోగ మౌలిక సదుపాయాలుగా అభివృద్ధి చేసే దిశగా తమ ప్రభుత్వం ఆలోచిస్తోందని తెలిపారు. డంప్ యార్డులను అభివృద్ధి కేంద్రాలుగా మార్చడమే తమ లక్ష్యం అని స్పష్టం చేశారు. 99 రోజుల ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కింద పట్టణ స్థానిక సంస్థలు, జిల్లా యంత్రాంగాలు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత స్థాయిలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.

**సమ్మిళిత అభివృద్ధికి దోహదపడే కార్యాచరణలో భాగం**

గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల తొలగింపు, రెండు వార్డుల్లో స్వచ్ఛ ఆటోలకు క్యూఆర్ ఆధారిత పర్యవేక్షణ పైలట్ ప్రాజెక్టు, 1000.72 మెట్రిక్ టన్నుల నిర్మాణ, కూల్చివేత వ్యర్థాల తొలగింపు, ప్రజా ప్రదేశాల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లు, పాత చెత్త తొలగింపు, నగరవ్యాప్తంగా ఈవేస్ట్ సేకరణ కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమాలు విడివిడిగా చేపట్టిన పారిశుధ్య చర్యలు కాదని, తెలంగాణ విజన్2047కు అనుగుణంగా పట్టణాల సమ్మిళిత అభివృద్ధికి దోహదపడే సమగ్ర కార్యాచరణలో భాగమని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. జపాన్ దేశంలోని కిటాక్యుషు నగర అభివృద్ధి మోడల్ ఆధారంగా బండరావిర్యాల, సిద్ధాపూర్ ప్రాంతాల్లో ప్రతిపాదించిన ఎకో టౌన్ తెలంగాణ సర్క్యులర్ ఎకానమీ ప్రయాణంలో ముఖ్యమైన ముందడుగని ఆయన పేర్కొన్నారు. 2047 నాటికి భారత్‌ను 3035 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్య సాధనలో రాష్ట్రం తన 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంతో కీలక పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్ సహా జాతీయ పరిశుభ్రత, పట్టణ పారిశుధ్య ర్యాంకింగ్స్‌లో రాష్ట్రం నిరంతరం మెరుగైన ప్రదర్శన కనబరుస్తోందని, ఇది పౌరులు, పారిశుధ్య కార్మికులు, స్థానిక సంస్థలు, ప్రభుత్వం కలిసి చేస్తున్న కృషికి నిదర్శనమని తెలిపారు. పరిశుభ్రత అనేది కేవలం నగరాల రూపురేఖలకు సంబంధించిన విషయం మాత్రమే కాదని, అది ప్రజారోగ్యం, మానవ గౌరవం, జీవన ప్రమాణాలతో ముడిపడి ఉందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. మహాత్మా గాంధీ భావజాలానికి అనుగుణంగా స్వచ్ఛతను ప్రజా జీవితంలో కీలక విలువగా భావిస్తూ తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. పరిశుభ్రత ప్రజల జీవనశైలిలో భాగం కావాలంటే చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. జపాన్ తరహాలో మొదటి తరగతి నుంచే పాఠశాలల్లో పరిశుభ్రత, వ్యర్థాల వేర్పాటు, పర్యావరణ బాధ్యత వంటి అంశాలను ఆచరణాత్మకంగా బోధించే అంశాన్ని అన్ని రాష్ట్రాలు పరిశీలించాలని సూచించారు. వ్యర్థాల నుంచి విద్యుత్, రీసైక్లింగ్, సర్క్యులర్ ఎకానమీ ప్రాజెక్టుల అమలుకు రాష్ట్రాలకు కేంద్రం తగిన ఆర్థిక సహకారం అందించాలని ఉప ముఖ్యమంత్రి కోరారు. ఈ రంగంలో ఆధునిక మౌలిక సదుపాయాలు, శాస్త్రీయ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ అందించే అంశాన్ని సానుకూలంగా పరిశీలించాలన్నారు. సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి తోఖన్ సాహు, కేంద్ర కార్యదర్శి శ్రీనివాస్ కటికితల, స్వచ్ఛ భారత్ మిషన్ డైరెక్టర్ రూపా మిశ్రా, సంబంధిత కేంద్ర అధికారులు, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ముఖ్యమంత్రి కార్యదర్శి మానిక్ రాజ్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తోపాటు వివిధ రాష్ట్రాల పట్టణాభివృద్ధి శాఖ మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఘన ఏర్పాట్లు

**హైదరాబాద్, మే19 సిరిన్యూస్::**

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈసారి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో వైభవంగా నిర్వహించనున్నట్లు వికాస్‌రాజ్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగా గన్‌పార్క్‌ను సందర్శించి తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన అనంతరం పరేడ్ గ్రౌండ్ కార్యక్రమాల్లో పాల్గొంటారని వెల్లడించారు. పరేడ్ గ్రౌండ్, గన్‌పార్క్ వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి శాఖ నుంచి ఒక నోడల్ అధికారిని నియమించి సమన్వయంతో కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ప్రముఖులు ప్రయాణించే మార్గాల్లో బందోబస్తు కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలని పోలీసు శాఖకు ఆదేశాలు జారీ చేశారు. పరేడ్ గ్రౌండ్‌కు వచ్చే వాహనాలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని, ట్రాఫిక్ రూట్ మ్యాప్ సిద్ధం చేసి నగర ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వాటర్‌ప్రూఫ్ షామియానాలు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బీ శాఖను ఆదేశించారు. సభా ప్రాంగణం పరిసరాల్లో పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు తాగునీటి సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. పండుగ వాతావరణాన్ని ప్రతిబింబించేలా కళాకారులతో ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సాంస్కృతిక శాఖకు సూచించారు. నగరంలోని అసెంబ్లీ, సచివాలయం, చార్మినార్, ప్రజాభవన్ సహా ప్రభుత్వ భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం జనరేటర్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. వేడుకలను విస్తృతంగా ప్రజలకు చేరవేసేందుకు లైవ్ టెలికాస్ట్ ఏర్పాట్లు చేయాలని సమాచార శాఖ స్పెషల్ కమిషనర్‌కు ఆదేశాలు ఇచ్చారు. ఈ నెల 25 నుంచి పరేడ్ గ్రౌండ్ వద్ద అన్ని శాఖలు సంయుక్తంగా రిహార్సల్స్ నిర్వహించాలని వికాస్‌రాజ్ సూచించారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు నవీన్ మిట్టల్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, కార్యదర్శి రఘునందన్ రావు, డీజీపీ మహేశ్ భగవత్, ఏడీజీ విజయ్‌కుమార్, టీజీ జెన్కో సీఎండీ హరీశ్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుందరెడ్డి, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## 'పాలమూరు' 90 శాతం

# పూర్తయిందనేది అబద్ధం

**మొదటిపేజీ తరువాయి**



ప్రాంతానికి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జిల్లాలో కొనసాగుతున్న ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులు, పనుల పురోగతిపై మంత్రి క్షుణ్ణంగా సమీక్షించారు.

సమీక్ష అనంతరం మంత్రి మాట్లాడుతూ పాలమూరు ప్రాజెక్టులకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఈ ప్రాజెక్టుల విషయంలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు 90 శాతం పూర్తయ్యాయని గత పాలకులు చెప్పడం పచ్చి అబద్ధమని తీవ్రంగా విమర్శించారు.

ప్రాజెక్టు డిజైన్‌ను జూరాల నుంచి శ్రీశైలం వైపు మార్చడం వల్ల పాలమూరు ప్రాంతానికి తీవ్ర నష్టం జరిగిందని మంత్రి ఆరోపించారు. కనీసం భూసేకరణ కూడా పూర్తి చేయకుండానే కేవలం కాల్వల కోసం టెండర్లు పిలిచి కాలయాపన చేశారని మండిపడ్డారు. ప్రాజెక్టు పనుల విషయంలో గత ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టించిందని అన్నారు.

ఉమ్మడి జిల్లాలోని అన్ని సాగునీటి ప్రాజెక్టుల ప్రస్తుత పురోగతి, మిగిలి ఉన్న పనుల షెడ్యూల్‌తో కూడిన సమగ్ర నివేదికను వెంటనే సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. రాబోయే 15 రోజుల్లో పాలమూరు ప్రాజెక్టులపై మరోసారి పూర్తి స్థాయి సమీక్ష సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు.

జూరాల ప్రాజెక్టులో పేరుకుపోయిన పూడిక సమస్య పరిష్కారానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని చెరువుల్లో పూడికతీత పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. వానాకాలం ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేసేలా కార్యాచరణ అమలు చేయాలని ఆదేశించారు.

# న్యాయవ్యవస్థపై దుష్ప్రచారం సహించం

- బండి భగీరథ్ కేసు వ్యవహారంలో మరో సిట్ ఏర్పాటు
- హైకోర్టు న్యాయమూర్తిని లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు
- జాయింట్ సీపీ శ్వేత నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు

**హైదరాబాద్, మే 19 సిరిన్యూస్:**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌కు సంబంధించిన పోక్సో కేసు వ్యవహారం తెలంగాణలో మరోసారి రాజకీయ, న్యాయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ కేసు విచారణ చేపట్టిన తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి మాధవి దేవిని లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో వైరల్ అయిన అనుచిత పోస్టులపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసింది.

జాయింట్ సీపీ శ్వేత ఆధ్వర్యంలో ఈ సిట్ పనిచేయనుంది. న్యాయవ్యవస్థ ప్రతిష్టను దెబ్బతీసేలా జరిగిన దుష్ప్రచారం వెనుక ఉన్న అసలు వ్యక్తులు, ఐటీ సెల్స్, సోషల్ మీడియా ఖాతాలపై లోతైన విచారణ చేపట్టనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

బండి భగీరథ్ ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా జస్టిస్ మాధవి దేవిని ఉద్దేశించి కొన్ని సోషల్ మీడియా వేదికల్లో అభ్యంతరకర పోస్టులు ప్రచారంలోకి వచ్చాయి. ఆమె బెయిల్ మంజూరు చేస్తే ప్రతిఫలంగా ఆమె కుటుంబ సభ్యులకు పదవులు ఇస్తారంటూ అసత్య ఆరోపణలు చేస్తూ పోస్టులు వైరల్ కావడం న్యాయ వర్గాల్లో ఆందోళన కలిగించింది.

ఈ ప్రచారంపై విచారణ ప్రారంభంలోనే జస్టిస్ మాధవి దేవి తీవ్ర ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. చట్టపరమైన విధుల్లో ఉన్న న్యాయమూర్తులపై వ్యక్తిగత దూషణలు, అసత్య ప్రచారాలు జరగడం బాధాకరమని వ్యాఖ్యానించినట్లు సమాచారం. తెలంగాణ న్యాయమూర్తుల సంఘం కూడా ఈ వ్యవహారాన్ని తీవ్రంగా ఖండించింది. న్యాయవ్యవస్థ గౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరింది.

ఈ ఘటనలో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న దామోదర్‌ను ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరికొందరిపై కూడా కేసులు నమోదు చేసినట్లు సమాచారం. సోషల్ మీడియాలో పోస్టులు ఎవరు రూపొందించారు, వాటిని ఎవరు వ్యాప్తి చేశారు, దీనికి వెనుక ఉన్న వ్యవస్థ ఏంటి అన్న అంశాలపై సిట్ దర్యాప్తు కొనసాగిస్తోంది.

న్యాయవ్యవస్థపై దుష్ప్రచారం, వ్యక్తిగత దాడులను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవడంతో ఈ కేసు రాజకీయంగా మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. సిట్ దర్యాప్తుతో ఈ వ్యవహారంలో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# సినిమా అవకాశం పేరుతో మోసం

**హైదరాబాద్, మే 19 సిరిన్యూస్:**

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఓ యువతిపై ఇద్దరు యువకులు లైంగికదాడికి పాల్పడిన ఘటన కలకలం రేపుతోంది. సినిమా షూటింగ్‌లో అవకాశం ఇస్తామని నమ్మించి యువతిని గదికి తీసుకెళ్లి రెండు రోజుల పాటు అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోలీసుల వివరాల ప్రకారం జూబ్లీహిల్స్ మెట్రో స్టేషన్ సమీపంలో నివసిస్తున్న ఇద్దరు అనాథ యువతులు చిన్న చిన్న సినిమా షూటింగ్‌లు, ఈవెంట్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఓ యువకుడు బాధిత యువతితో పరిచయం పెంచుకుని సినిమా షూటింగ్ అవకాశం ఉందంటూ నమ్మించాడు. అనంతరం ఆమెను సికింద్రాబాద్‌లోని ఓ గదికి తీసుకెళ్లిన నిందితుడు, తన స్నేహితుడితో కలిసి రెండు రోజుల పాటు లైంగికదాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నెల 16న ర్యాపిడో ద్వారా యువతిని తిరిగి పంపించినట్లు సమాచారం. ఇంటికి వచ్చిన ఆమె ఒంటిపై గాయాలు ఉండటాన్ని గమనించిన స్నేహితురాలు వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించింది. వైద్యులు వివరాలు అడగడంతో తనపై లైంగికదాడి జరిగిన విషయాన్ని బాధితురాలు వెల్లడించినట్లు తెలిసింది.

దీంతో బాధితురాలి స్నేహితురాలు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు ఆధారంగా ఇద్దరు గుర్తుతెలియని యువకులపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ కెమెరా దృశ్యాలు, ఫోన్ కాల్ వివరాల ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సమాచారం.

సినిమా అవకాశాల పేరుతో యువతులను మోసం చేసే ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో అపరిచితుల మాటలు నమ్మి వెళ్లొద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఈ కేసులో అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

# మిషన్ జూన్ 2...!

**మొదటిపేజీ తరువాయి**

రేవంత్ రెడ్డి సర్కారు అధికారంలోకి వచ్చి సగం గడువు పూర్తి కావస్తుండటంతో పాలనకు కొత్త ఊపు తెచ్చేందుకు అధిష్ఠానం 'మిషన్ ప్రక్షాళన'కు శ్రీకారం చుట్టింది. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో కాంగ్రెస్ హైకమాండ్ దృష్టి ఇప్పుడు పూర్తిగా తెలంగాణ రాజకీయాలపై పడింది. ఇప్పటికే మంత్రుల ప్రోగ్రెస్ రిపోర్టులను పరిశీలించిన అధిష్ఠానం, పాలనలో మరింత వేగం పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఢిల్లీ వేదికగా జోరుగా లాబీయింగ్ మంత్రివర్గ విస్తరణపై వస్తున్న ఊహాగానాలతో ఆశావహులు అలర్ట్ అయ్యారు. క్యాబినెట్‌లో చోటు దక్కించుకునేందుకు సీనియర్ ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున ఢిల్లీ బాట పట్టారు. పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి ఏకంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కలిసి తన కుటుంబానికి ఉన్న మూడు తరాల విధేయతను వివరించగా, పలువురు సీనియర్లు అధిష్ఠాన పెద్దల వద్దకు తమ ప్రతిపాదనలను పంపుతున్నారు.

**క్యాబినెట్ రేసులో పెరుగుతున్న సంఖ్య...**

ప్రస్తుత అంచనాల ప్రకారం సామాజిక, ప్రాంతీయ సమీకరణాల నేపథ్యంలో క్యాబినెట్ రేసులో సంఖ్య పెరుగుతూనే ఉంది. ఇందులో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి ఈ సీనియర్ నేతకు మంత్రి పదవి దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సరైన ప్రాతినిధ్యం కల్పించే ఉద్దేశంతో మల్‌రెడ్డి రంగారెడ్డి (ఇబ్రహీంపట్నం) పేరు కూడా పరిశీలనలో ఉంది. బీసీ సామాజిక వర్గానికి పెద్దపీట వేసే ఉద్దేశ్యంతో కొత్తగా ఒక డిప్యూటీ సీఎం పదవిని ఆ వర్గానికి కేటాయించే ఆలోచనలో అధిష్ఠానం ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే ప్రస్తుత టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు క్యాబినెట్‌లో చోటు కల్పించి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పీసీసీ బాధ్యతలు అప్పగిస్తారనే ప్రచారం కూడా నడుస్తోంది. కోదండరామ్ (టీజేఎస్) లేదా సినీ నటి, సీనియర్ నేత విజయశాంతి వంటి వారికి కూడా క్యాబినెట్‌లో లేదా నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించే వీలుంది.

**సీఎం రేవంత్ రెడ్డి ముందున్న సవాళ్లు...**

ఈ విస్తరణ కేవలం ఖాళీల భర్తీ మాత్రమే కాదు.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను తట్టుకునేందుకు వేస్తున్న వ్యూహాత్మక అడుగు అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. గతంలో సామాజిక న్యాయం ఫార్ములాతో ముదిరాజ్ వంటి వెనుకబడిన సామాజిక వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు కూడా రెడ్డి, బీసీ, ఎస్సీ/ఎస్టీ వర్గాల మధ్య సమతూకం దెబ్బతినకుండా చూసుకోవాలని భావిస్తున్నారు. అయితే ఆశావహులు ఎక్కువగా ఉండి, అవకాశాలు తక్కువగా ఉండటం వల్ల పదవులు రాని వారిలో అసంతృప్తి పెరగకుండా వారికి నామినేటెడ్ కార్పొరేషన్ పదవులను ఆఫర్ చేసే వ్యూహంలో ప్రభుత్వం ఉంది.

**పనితీరు ఆధారంగా మార్పులు..**

నాన్‌పెర్ఫార్మింగ్ (సరిగ్గా పనిచేయని) ఒకరిద్దరు మంత్రులను తొలగించి లేదా వారి శాఖలను మార్చడం ద్వారా పాలనను ట్రాక్‌లోకి తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 21న జరగాల్సిన క్యాబినెట్ సమావేశం వాయిదా పడ్డట్లు తెలుస్తోంది. కాగా ఈనెల 23న యాదగిరిగుట్టలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి అక్కడే క్యాబినెట్ సమావేశం నిర్వహించాలని యోచిస్తున్నట్లు తెలిసింది. తెలంగాణ క్యాబినెట్ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు వెళ్లి అధిష్ఠానం నుంచి తుది జాబితాకు ఆమోదం పొందే అవకాశం ఉంది. రాబోయే రెండున్నరేళ్ల పాలనను మరింత దూకుడుగా, సంక్షేమం, అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు ఈ విస్తరణ ఒక కీలక మలుపు కానుంది.

# సామజిక మాద్యమాలపై పై సాక్ఐ

**మొదటిపేజీ తరువాయి**

ప్రచారాలను తగ్గించేందుకు 'సాక్ ఐ' పేరుతో ఏఐ ఆధారిత సామజిక మాధ్యమాల మానిటరింగ్ వ్యవస్థ ప్రారంభించారు.

సోషల్ మీడియాలో విద్వేషపూరిత పోస్టుల ను ఆటోమేటెడ్‌గా గుర్తింపు

నేర నెట్‌వర్క్‌ల విశ్లేషణకు ఏఐ సాంకేతికత ను వినియోగించనున్నారు.అలాగే

మహిళలు, చిన్నారుల భద్రతకు ముప్పుగా ఉన్న కంటెంట్‌పై ప్రత్యేక నిఘా పెట్టనున్నారు.హానికర అభ్యంతరకర పోస్టులను తొలగించే చర్యలు సైబర్ నేరాల నియంత్రణలో పోలీసులకు ఆధునిక సాంకేతిక సహాయం సామజిక మాధ్యమాలలో భద్రత, చట్టవ్యవస్థ బలోపేతానికి. అధునాతన టెక్నాలజీ వాడకం ఎంతో ఉపయోగం కానున్నది. సామాజిక మాధ్యమాల్లో ఒక కంటెంట్ రాగానే అందులో ఉన్న వాస్తవం ఎంత అది నిజామా లేదా అనికూడా గమనించకుండా పంపడం కు ఇక చెక్ పడనుంది. కొత్త టెక్నాలజీ నేరాల నియంత్రణకు ఉపయోగ పడనుంది. ఒక వైపు సైబర్ నేరాల అదుపు కోసం ఎప్పటికప్పుడు కొత్తగా ఆలోచిస్తున్న పోలీసు విభాగం ఏఐ టెక్నాలజీ వాడటం మూలంగా మరింత సైబర్ నేర నియంత్రణ జరిగే అవకాశం ఉంది.




# వాట్సాప్ మీ-సేవ.. మరిన్ని జీహెచ్ఎంసీ సేవలు

- **కొత్తగా తొమ్మిది పౌర సేవలు అందుబాటులోకి**
- **డిజిటల్ సేవలను మరింత విస్తరించిన ప్రభుత్వం**

**హైదరాబాద్, మే 19 సిరిన్యూస్::**

జీహెచ్ఎంసీకి సంబంధించిన పౌర సేవలను కొత్తగా మీసేవ వాట్సాప్, చాట్‌బాట్ ద్వారా ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రజలకు మరింత సౌకర్యం, అందుబాటు, పారదర్శకత కల్పించే దిశగా ఈ సేవలను విస్తరించారు. ఈ మేరకు ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ విభాగం ఒక ప్రకటన విడుదల చేసింది. కొత్తగా జీహెచ్ఎంసీ ప్రాపర్టీ అసెస్‌మెంట్ రివిజన్, జనన ధ్రువీకరణ సవరణ, మరణ ధ్రువీకరణ సవరణ, బర్త్ హోమ్(ఇంటి దగ్గర పుట్టిన), డెత్ హోమ్(ఇంటి దగ్గర చనిపోయిన), ప్రాపర్టీ డోర్ నంబర్ సవరణ, ప్రాపర్టీ పేరు సవరణ, ప్రాపర్టీ ట్యాక్స్ సేవలు, ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ సేవలను వాట్సాప్ మీసేవలో చేర్చారు. రాష్ట్రవ్యాప్తంగా పౌరులు ఈ సేవలను వాట్సాప్ ద్వారానే పొందవచ్చని ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ విభాగం తెలిపింది. సేవలు పొందేందుకు ముందుగా 8096958096 నంబర్‌ను మొబైల్‌లో 'మీ సేవ తెలంగాణ' పేరుతో సేవ్ చేసుకోవాలి. అనంతరం వాట్సాప్‌లో ఆ నంబర్‌కు హాయ్(Hi) సందేశం పంపాలి. అవసరమైన సేవ పేరు టైప్ చేసి మెనూలో కనిపించే ఓపెన్ సర్వీస్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఫారంలో అడిగిన వివరాలు, చెల్లింపు పూర్తి చేస్తే దరఖాస్తు వెంటనే వాట్సాప్ ద్వారా నమోదవుతుంది. వాట్సాప్ ఆధారిత మీ సేవ వేదికకు ప్రారంభం నుంచి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని ప్రభుత్వం వెల్లడించింది. జనన ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పోలీస్ చలాన్, విద్యుత్ బిల్లు, బీఐఈ ఫలితాల సేవలను ప్రజలు ఎక్కువగా వినియోగిస్తున్నట్లు తెలిపింది. రోజువారీ పరిపాలన సేవలకు వాట్సాప్‌పై ప్రజల ఆధారపడటం పెరుగుతోందని పేర్కొంది.

## లులు మార్కెట్‌లో పనికిరాని

# ఆహార పదార్థాలు

**హైదరాబాద్, మే 19 సిరిన్యూస్:**

కూకట్‌పల్లిలోని లులు హైపర్ మార్కెట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజారోగ్యానికి హాని కలిగించే విధంగా ఉన్న దాదాపు 150 కిలోల ఆహార పదార్థాలను వారు సీజ్ చేశారు. మంగళవారం ఈ హైపర్ మార్కెట్‌లో తనిఖీలు చేపట్టిన అధికారులకు పలు ఆహార పదార్థాల్లో పురుగులు ఉండటాన్ని గుర్తించారు. అలాగే నాసిరకం ఆహార పదార్థాలు నిల్వ చేసినట్లు కనుగొన్నారు. కిచెన్ అపరిశుభ్రంగా ఉండడాన్ని అధికారులు గుర్తించారు. పాడైపోయిన కూరగాయలతోపాటు పరిసర ప్రాంతాలలో పురుగులు సంచరిస్తున్నట్లు ఈ తనిఖీల్లో అధికారులు గమనించారు. గడువు సవి□పించిన ఆహార పదార్థాలపై తప్పుదారి పట్టించే విధంగా లేబుళ్లు అతికించినట్లు గుర్తించారు. గడువు ముగిసిన ఎఫఎసఎసఏఐ లైసెన్స్‌తో ప్యాక్‌డ్ ఫుడ్ విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ మార్కెట్ నుంచి బయటకు వెళ్లే డ్రైనేజీ కూడా మాంసాహార వ్యర్థాలతో మ□సుకుపోయినట్లు తనిఖీల్లో తేలింది. కల్తీ, అధిక కృత్రిమ రంగుల అనుమానంతో పలు ఆహార పదార్థాల నమ□నాలను అధికారులు సేకరించారు.

# స్నేహం పేరుతో మోసం

- **బీటెక్ విద్యార్థినిపై అత్యాచారం**
- **టీ తాగుదామని పిలిచి మద్యం తాగించిన యువకుడు**
- **బాధితురాలి ఫిర్యాదుతో నిందితుడి అరెస్ట్**

**హైదరాబాద్, మే 19 సిరిన్యూస్:**

హైదరాబాద్ శివారు ఇబ్రహీంపట్నంలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. స్నేహితుడిగా నమ్మిన యువకుడు ఓ బీటెక్ విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. టీ తాగుదామని బయటకు తీసుకెళ్లి, బలవంతంగా మద్యం తాగించి ఈ ఘాతుకానికి ఒడిగట్టిన ఘటన కలకలం రేపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.

పోలీసుల వివరాల ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌కు చెందిన ఉడుతల విజయ్ ఇబ్రహీంపట్నంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. అదే కళాశాలలో చదువుతున్న యువతితో అతనికి పరిచయం ఉంది. ఈ నెల 14 రాత్రి టీ తాగుదామని చెప్పి యువతిని బయటకు పిలిచిన విజయ్, తన కారులో దిల్‌సుఖ్‌నగర్‌కు తీసుకెళ్లాడు.

తిరుగు ప్రయాణంలో మద్యం కొనుగోలు చేసిన నిందితుడు, మార్గమధ్యంలోని ఓ నిర్మానుష్య ప్రాంతానికి కారును మళ్లించినట్లు పోలీసులు తెలిపారు. అక్కడ యువతికి బలవంతంగా మద్యం తాగించి, ఆమె మత్తులోకి వెళ్లిన తర్వాత తన గదికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

మరుసటి రోజు ఉదయం స్పృహలోకి వచ్చిన యువతి జరిగిన విషయాన్ని గుర్తించి తీవ్ర ఆందోళనకు గురైంది. కొంతకాలం మానసిక వేదనకు గురైన ఆమె ఈ నెల 17న ఇబ్రహీంపట్నం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడు విజయ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

నిందితుడిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. యువతుల భద్రతపై మరోసారి ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చకు దారితీసింది.

# మరోసారి కేఆర్ఎంబీ సమావేశం వాయిదా

- **ఉభయ రాష్ట్రాల కేబినెట్ భేటీలతో తేదీల మార్పు**
- **21న జరగాల్సిన సమావేశం రద్దు**
- **త్వరలో కొత్త తేదీ ప్రకటిస్తామని కృష్ణా బోర్డు వెల్లడి**
- **నదీ జలాల అంశాలపై కీలక చర్చలకు మరో బ్రేక్**

**హైదరాబాద్, మే19:**

రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నదీ జలాల వాటాలు, ఇతర కీలక అంశాలపై చర్చించేందుకు ప్రతిపాదించిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు 21వ సమావేశం మరోసారి వాయిదా పడింది. ఉభయ రాష్ట్రాల ప్రభుత్వాల ముందస్తు రాజకీయ, పరిపాలనా కార్యక్రమాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

వాస్తవానికి 21వ బోర్డు సమావేశాన్ని ఈ నెల 14న నిర్వహించాలని ముందుగా నిర్ణయించారు.

అయితే అదే రోజున ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశం ఖరారు కావడంతో సమావేశాన్ని ఈ నెల 21కి వాయిదా వేస్తూ గతంలో నిర్ణయం తీసుకున్నారు.

తాజాగా మార్చిన తేదీ అయిన ఈ నెల 21న తెలంగాణ మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో, KRMB సమావేశాన్ని మరోసారి వాయిదా వేయాలని తెలంగాణ ప్రభుత్వం బోర్డును కోరింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని పరిశీలించిన కృష్ణా బోర్డు 21న జరగాల్సిన సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

సమావేశానికి సంబంధించిన తదుపరి తేదీని త్వరలోనే ప్రకటిస్తామని కృష్ణా బోర్డు స్పష్టం చేసింది. ఈ మేరకు సమాచారాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల అధికారులకు అధికారికంగా చేరవేసింది.

కృష్ణా జలాల పంపిణీ, ప్రాజెక్టుల నిర్వహణ, నీటి వినియోగ అంశాలపై ఈ సమావేశంలో కీలక చర్చలు జరిగే అవకాశం ఉండటంతో ఉభయ రాష్ట్రాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. సమావేశం మరోసారి వాయిదా పడటంతో కీలక నిర్ణయాలు మరింత ఆలస్యం కానున్నాయి.

# 22, 23లలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్

**హైదరాబాద్, మే 19 :**

ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 433 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్ లిస్టును మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మంగళవారం విడుదల చేసింది. ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున (1:3) అభ్యర్థులను సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఆహ్వానించింది. హైదరాబాద్‌లోని వెంగళరావు నగర్‌లో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రాంగణంలో ఈ నెల 22, 23 తేదీల్లో వెరిఫికేషన్ జరగనుంది. విద్యార్హత, కమ్యూనిటీనిటీ, తదితర అన్ని సర్టిఫికెట్లతో వెరిఫికేషన్‌కు హాజరు కావాలని బోర్డు పేర్కొంది. ఈ నెల 22, 23వ తేదీల్లో వెరిఫికేషన్‌కు హాజరు కాలేని వారు ఈ నెల 25న వచ్చి సర్టిఫికెట్లు అందజేయవచ్చునని బోర్డు స్పష్టం చేసింది. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని 34 డిపార్ట్‌మెంట్లలో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి గతేడాది మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్, గైనకాలజీ, అనస్థీషియా డిపార్ట్‌మెంట్లలోని 174 పోస్టుల భర్తీ ప్రక్రియ ఇప్పటికే పూర్తి అయింది. ఆయా పోస్టులకు ఎంపికైన డాక్టర్లకు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇటీవలే నియామక పత్రాలు కూడా అందజేశారు. మిగిలిన 30 విభాగాలలోని 433 పోస్టులకు సంబంధించిన మెరిట్ లిస్టును మంగళవారం విడుదల చేశారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన డాక్టర్ల జాబితాను విడుదల చేస్తామని బోర్డు తెలిపింది.

# ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

**హైదరాబాద్, మే 19 సిరిన్యూస్::**

నేటి డిజిటల్ యుగంలో జర్నలిజం రంగం వేగంగా మారుతున్న నేపథ్యంలో మీడియా వృత్తిదారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ముందుకు సాగాలని పలువురు సీనియర్ జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నాంపల్లిలోని మీడియా అకాడమీ భవనంలో మంగళవారం నిర్వహించిన జర్నలిస్టుల చర్చా కార్యక్రమంలో పలువురు సీనియర్ జర్నలిస్టులు, అకాడమీకి అనుబంధ సభ్యులు పాల్గొని మీడియా రంగ భవిష్యత్ దిశ, డిజిటలైజేషన్, మీడియా చట్టాలు, శిక్షణ కార్యక్రమాలు, జర్నలిస్టుల సంక్షేమ అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ జి.ముకుంద్ రెడ్డి జర్నలిస్టులను అభినందించారు. జర్నలిజం డిగ్రీ చదివే రోజుల్లో పత్రికల ఎడిటోరియల్స్ చదవడం ద్వారా సివిల్ సర్వీసులపై ఆసక్తి పెరిగిందని, అదే తన విజయానికి పునాది అయిందని తెలిపారు. ఐ.వెంకట్ రావు మాట్లాడుతూ మీడియా అకాడమీ చేపడుతున్న కార్యక్రమాలను అభినందిస్తూ మరిన్ని పుస్తకాలను అకాడమీకి అందజేస్తానని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్ మాట్లాడుతూ జర్నలిజం తనకు ధైర్యం, గుర్తింపు ఇచ్చిందని పేర్కొంటూ అకాడమీకి కృతజ్ఞతలు తెలిపారు. ఉడుముల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఆధునిక జర్నలిజానికి అనుగుణంగా అకాడమీ డిజిటల్ క్లాసులు, ఇంక్యుబేటర్ ఏర్పాటు చేయాలని, గ్యాగ్ ఆర్డర్ వంటి అంశాలపై చర్చలు నిర్వహించాలని సూచించారు. దేవులపల్లి అమర్ మాట్లాడుతూ 16 మంది వెటరన్ జర్నలిస్టుల వీడియోలను పుస్తకాల రూపంలో తీసుకురావాలని కోరారు. మీడియా రంగంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) ప్రభావం పెరుగుతోందని, జర్నలిస్టులు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన |ంపొందించుకోవాల్సిన అవసరం ఉందని పలువురు సభ్యులు సూచించారు. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఆధునిక శిక్షణ కార్యక్రమాలు, ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాములు, డెస్క్ జర్నలిస్టులకు ప్రత్యేక శిక్షణలు నిర్వహించాల్సిన అవసరం ఉం<న్నారు. అకాడమీ భవనంలోని డిజిటల్ సదుపాయాలు, ఆధునిక ఆడిటోరియం, బోర్డు రూమ్, లైబ్రరీ, కంప్యూటర్ రూమ్ వంటి వసతులను మరింత సమర్థవంతంగా వినియోగించి జర్నలిస్టులకు ప్రయోజనం కలిగించాలని అభిప్రాయపడ్డారు. పాత పత్రికలు, అరుదైన పుస్తకాలు, నిజాం కాలం నాటి ప్రచురణలు, తెలుగు గ్రంథాలు తదితరాలను డిజిటలైజ్ చేసి భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. పలువురు సీనియర్ జర్నలిస్టులు తమ వద్దనున్న విలువైన పుస్తకాలను మీడియా అకాడమీ లైబ్రరీకి విరాళంగా అందిస్తామని తెలిపారు.

# జలమండలిలో భారీ అవినీతి బట్టబయలు

**హైదరాబాద్, మే 19 సిరిన్యూస్:**

హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ మురుగునీటి పారుదల బోర్డులో భారీ అవినీతి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలతో వాటర్ బోర్డ్ రెడ్ హిల్స్ విభాగం జనరల్ మేనేజర్ ఎస్ ఎల్ కుమార్‌కు చెందిన ఇళ్లు, కార్యాలయాలపై అవినీతి నిరోధక శాఖ అధికారులు మంగళవారం మెరుపు దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో భారీగా నగదు, బంగారం, ఆస్తి పత్రాలు బయటపడటంతో కలకలం రేగింది.

ఏసీబీ డీఎస్పీ ఆధ్వర్యంలో హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టారు. ఉదయం ప్రారంభమైన ఈ తనిఖీల్లో రూ.1.10 కోట్లకు పైగా నగదు, కేజీ బంగారు ఆభరణాలు, సుమారు రెండున్నర కిలోల వెండి వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పలు కీలక ఆస్తి పత్రాలను కూడా సీజ్ చేసినట్లు సమాచారం. హైదరాబాద్ మల్లాపూర్‌లోని కుమార్ నివాసంలో నగదు లెక్కింపు, బంగారు ఆభరణాల సీజ్ ప్రక్రియను అధికారులు చేపట్టారు. ఈ దాడుల్లో లభించిన పత్రాల ఆధారంగా మరిన్ని ఆస్తుల వివరాలను కూడా ఏసీబీ అధికారులు సేకరిస్తున్నారు.ప్రాథమిక దర్యాప్తులో భాగంగా ఎస్ ఎల్ కుమార్ పేరుతో హైదరాబాద్‌లోని ప్రముఖ గేటెడ్ కమ్యూనిటీల్లో మూడు ఫ్లాట్లు, ఆరు ఓపెన్ ప్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. నిజామాబాద్ జిల్లాలో మూడు ఎకరాల వ్యవసాయ భూమితో పాటు పలు విలాసవంతమైన వాహనాలు కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మొత్తం ఆస్తుల మార్కెట్ విలువ సుమారు రూ.100 కోట్ల వరకు ఉండవచ్చని ఏసీబీ అంచనా వేస్తోంది.

ప్రస్తుతం ఎస్ ఎల్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఆస్తులకు సంబంధించిన ఆదాయ వనరులు, బ్యాంకు లావాదేవీలు, లాకర్ల వివరాలపై లోతుగా విచారణ కొనసాగుతోంది. త్వరలో బ్యాంకు లాకర్లను కూడా తెరిచి తనిఖీ చేసే అవకాశముంది.

ఇటీవల రవాణా శాఖ అధికారికి సంబంధించిన అక్రమాస్తుల కేసు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఇప్పుడు వాటర్ బోర్డ్ అధికారిపై జరిగిన దాడులు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను ఏసీబీ అధికారులు అధికారికంగా వెల్లడించనున్నారు.

## సమస్యను గుర్తించండి..
### ప్రమాదాలు జరిగేలోపు చర్యలు తీసుకోండి
### నల్లవల్లి బీటీ రోడ్డుపై వాహనదారుల ఆందోళన

**గుమ్మడిదల, మే 19 (సిరి న్యూస్ ):**



గుమ్మడిదల మండల పరిధిలోని నల్లవల్లి గ్రామం నుంచి ప్రధాన రహదారి వరకు ఉన్న బీటీ రోడ్డుకు ఇరువైపులా వర్షాలు పడిన సమయంలో మట్టి కొట్టుకుపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు అంచులు దిగజారిపోవడంతో వాహనాలు ఒకసారి క్రిందకు దిగితే తిరిగి రోడ్డుపైకి ఎక్కలేని పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా మలుపులు ఉన్న ప్రాంతాల్లో ప్రమాద భయం నెలకొంది. రాత్రి సమయంలో ఈ సమస్య మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెలుతురు సరిగా లేకపోవడం, రోడ్డు అంచులు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు అంచుల్లో మట్టి వేసి సమతలీకరణ చేయడంతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## మంత్రుల పర్యటనకు కదిలిన బొల్లారం భారీగా తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు!



**జిన్నారం మే 19 సిరి న్యూస్**

పటాన్ చేరు నియోజకవర్గం లో 83 కోట్ల అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపన కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు వివేక్ వెంకటస్వామి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ కార్యక్రమానికి బొల్లారం డివిజన్ పరిధి నుండి రాష్ట్ర నాయకులు వి. చంద్ర రెడ్డి ఆధ్వర్యంలో భారీగా తరలి వెళ్లిన కాంగ్రెస్ నాయకులు,సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక వసతుల పటిష్టత 83 కోట్ల నిధులతో నియోజకవర్గ పరిధిలో అత్యంత కీలకమైన పారిశ్రామిక ప్రాంతమని ఇక్కడి మౌలిక వసతులను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.గత ప్రభుత్వాలపై విమర్శలు గత పదిహేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వం కేవలం పేపర్ల మీద, సోషల్ మీడియాలోనే శంకుస్థాపనలకు పరిమితమైందని తాము అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే నిధులు కేటాయించి వాస్తవ రూపంలో పనులను ముందుకు తీసుకు వెళ్తున్నామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో వరప్రసాద్ రెడ్డి, నరసింహారాజ్ ,సంపత్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రాజగోపాల్ ,ఇమ్రాన్, అబ్దుల్ బషీర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయంగా మందుల సరఫరా
### మెదక్ జిల్లా డ్రగ్స్ ఇన్స్పెక్టర్ చంద్రకళ.

**రామాయంపేట, మే 1 9 (సిరి న్యూస్)**



అఖిల భారత ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ పిలుపు మేరకు 20-05-2026 తేదిన నిర్వహించనున్న బంద్ కారణంగా మెదక్ జిల్లాలోని మెడికల్ షాపులు ఎక్కువగా మూసివేయబడే అవకాశం ఉంది.ప్రజలకు అవసరమైన అత్యవసర మరియు ప్రాణరక్షక మందుల సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ తరఫున ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయబడింది.

**అత్యవసర మందుల అవసరమైతే ప్రజలు క్రింది నంబర్లను సంప్రదించవచ్చు:**

**హెల్ప్ డెస్క్ నంబర్లు:**9440155858,9440025572,9985466335

**డీసీఏ హెల్ప్‌లైన్ నంబర్:**1800-599-6968

**డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్, మెదక్ జిల్లా:**8333818140 ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జిల్లాలోని ఆసుపత్రులకు అనుబంధంగా ఉన్న అన్ని ఫార్మసీలు మందుల సరఫరాకు అందుబాటులో ఉంటాయి.ప్రజలు ఆందోళన చెందకుండా అవసరమైన సేవలను వినియోగించుకోవాలని మెదక్ జిల్లా డ్రగ్స్ ఇన్స్పెక్టర్ చంద్రకళ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే రోహిత్ రావు.

**రామాయంపేట, మే 19 (సిరి న్యూస్)**



మంగళవారం నాడు రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో CMRF చెక్కులు పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ శాసనసభ్యుడు డా. మైనంపల్లి రోహిత్ రావు హాజరు కావడం జరిగింది. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే చిక్కులను అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా ,వైస్ చైర్ పర్సన్ పోచమ్మల నవనీత గణేష్ , మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండారి మహేందర్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్ రెడ్డి,7వ వార్డు కౌన్సిలర్ గజవాడ నాగరాజు ,4వ వార్డు కౌన్సిలర్ బైరం స్వప్న కుమార్ 6వ వార్డు కౌన్సిలర్ పుట్టి సందీప్ 9వవార్డు కౌన్సిలర్ దేవుని రంజిత్,కోఆప్షన్ సభ్యులు, గౌస్ , దేమే యాదగిరి, కాంగ్రెస్ జిల్లా నాయకులు ఉపాధ్యక్షులు చింతల యాదగిరి, జిల్లా కార్యదర్శి పోచమ్మల గణేష్, మరియు సీనియర్ నాయకులు దాకి స్వామి, పార్టీ నాయకులు చింతల స్వామి, విప్లవ్ కుమార్, కుమార్ సాగర్, హనుమంత్ రావు , రామాయంపేట మండల సర్పంచులు మరియు కాంగ్రెస్ మండల నాయకులు మరియు పట్టణ నాయకులు తొంటావలి యాదగిరి, చిలుక స్వామి మరియు చిలుక విరాట్, భాను సుధీర్,దేవుని నరేష్, గణేష్ , సోహెల్ నరేందర్,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

- ఘనమైన చరిత్ర కల్గిన జిల్లా మెదక్.
- జిల్లా అదనపు కలెక్టర్ మెంచు నగేష్.

**మెదక్ మే,19(సిరిన్యూస్)**



చారిత్రక సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యతగా మెదక్ జిల్లాకు వేల ఏళ్ల చరిత్ర, అపారమైన సంస్కృతి, సంప్రదాయాలు,కళలు, ఆచారాలు గొప్ప గుర్తింపు కల్గిన జిల్లా అని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు.మంగళవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా చరిత్ర,సంస్కృతి,సాంప్రదాయాలను,వారసత్వ సంపదను కాపాడుకోవాలనీ సిఎస్ఐ పాఠశాలలోని ఆడిటోరియంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ...పూర్వీకులు నిర్మించిన దేవాలయాలు, కోటలు,మసీదులు, పురాతన కట్టడాలు, జానపద కళలు, భాషలు, సాహిత్యం, సంప్రదాయ పండుగలు మన చారిత్రక మరియు సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయన్నారు.వారసత్వాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చరిత్ర అనేది కేవలం గతాన్ని గుర్తుచేసేది మాత్రమే కాదు, భవిష్యత్తు తరాలకు మార్గదర్శకం అన్నారు.మన పూర్వీకుల త్యాగాలు, సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం, కళా వైభవం సమాజ అభివృద్ధికి పునాది వంటివని తెలిపారు. మన సంస్కృతికి ప్రత్యేక గుర్తింపు ఉండటానికి మన పురాతన సంపద, వైవిధ్యభరితమైన సంప్రదాయాలే కారణమని వివరించారు.మునిపల్ ఛైర్పర్సన్ కనుగు రాధిక భూపతి రాజ్ మాట్లాడుతూ..యువత తమ సంస్కృతి, చరిత్ర పట్ల అవగాహన పెంచుకొని వాటి పరిరక్షణలో ముందుండాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో చారిత్రక వారసత్వంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, జిల్లా పౌర సంబంధాల అధికారి రామచంద్రరాజు,కవులు,రచయితలు,ఉపాధ్యాయులు,పౌరులు రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గీతం విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి 'ఫ్యూచర్ ఎక్స్5'

- పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు
- ఏఐ, సైబర్ సెక్యూరిటీ, క్వాంటం కంప్యూటింగ్ వంటి రంగాలపై అవగాహన
- మే 23 నుంచి జూన్ 6 వరకు నిర్వహణ

**రామచంద్రపురం,(పటాన్చెరు), మే 19, (సిరి న్యూస్):**

విద్యార్థుల్లో భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 'ఫ్యూచర్ ఎక్స్5' పేరుతో ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల శ్రేణిని ప్రారంభించింది. గీతంలోని శిక్షణ, మార్గదర్శకత్వం, వృత్తి మార్గదర్శకత్వ డైరెక్టరేట్ (టీఎంసీజీ) పరిధిలోని శిక్షణ, సామర్థ్య వికాస విభాగం ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ రోజీనా మాథ్యూ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.కృత్రిమ మేధస్సు, సైబర్ సెక్యూరిటీ, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్, క్వాంటం కంప్యూటింగ్, కార్పొరేట్ రెడీనెస్, ఎథికల్ హ్యాకింగ్ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలపై విద్యార్థులకు పరిశ్రమ అనుభవజ్ఞుల ద్వారా అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆమె వివరించారు.మే 23 నుంచి జూన్ 6 వరకు ప్రతి వారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఆధునిక సాంకేతికతలపై ఆచరణాత్మక అవగాహన పెంపొందించుకోవడంతో పాటు, పరిశ్రమ నిపుణులతో నేరుగా మమేకమయ్యే అవకాశాన్ని పొందుతారని పేర్కొన్నారు.మే 23న వినియోగదారు సంబంధాల నిర్వహణ (సీఆర్ఎం), ప్రాజెక్టు నిర్వహణ అంశాలపై విల్‌కామ్ డెలివరీ మేనేజర్ శశిధర్ కొండూరి శిక్షణ ఇవ్వనున్నారు. మే 30న ఈవై డైరెక్టర్ మూర్తి పరవశివం క్వాంటం కంప్యూటింగ్, భద్రతపై అవగాహన కల్పించనున్నారు. మే 31న ఎంఎక్స్4 భాగస్వామి, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ గురుసిద్ధయ్య కార్పొరేట్ సంస్కృతి, ఇంటర్వ్యూ నైపుణ్యాలు, స్వీయ బ్రాండింగ్ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. జూన్ 6న లిబరల్ సెక్యూరిటీ వ్యవస్థాపకులు సుజయ్ గంకిడి నైతిక హ్యాకింగ్‌పై అవగాహన కల్పించనున్నారు.పరిశ్రమ భవిష్యత్ ధోరణులను అర్థం చేసుకుని, కెరీర్ అవకాశాలకు సిద్ధమవ్వాలంటే విద్యార్థులు ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ రోజీనా మాథ్యూ సూచించారు.

# మత్స్యకార కుటుంబాలకు భరోసా కల్పించాలి

- సంఘ భవనం, బీమా సదుపాయాల కోసం ప్రభుత్వానికి వినతి
- బొంతపల్లి వీరన్నగూడెంలో మత్స్యకారుల సంఘం నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**గుమ్మడిదల, మే 19 (సిరి న్యూస్):**



మత్స్యకార కుటుంబాల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా చర్యలు తీసుకోవాలని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ సిహెచ్ కుమార్ గౌడ్ కోరారు. మత్స్యకారులకు సంఘ భవనం, బీమా సౌకర్యాలు కల్పించి ఆర్థిక భరోసా అందించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని బొంతపల్లి వీరన్నగూడెంలో మత్స్యకారుల సంక్షేమ సహకార సంఘం నూతన కమిటీని మంగళవారం జిల్లా మత్స్యశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రమేష్, జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ ఉప్పరి వెంకటేష్ సమక్షంలో నిర్వహించిన ఎన్నికల్లో నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ సిహెచ్ కుమార్ గౌడ్ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించి నియామక పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో చేప పిల్లల పంపిణీ వంటి పథకాలు మత్స్యకారులకు ఎంతో ఉపయోగపడ్డాయని గుర్తు చేశారు. ప్రస్తుతం కూడా పేద మత్స్యకార కుటుంబాలకు ఉపాధి అవకాశాలు, ఆర్థిక సహాయం అందించాల్సిన అవసరం ఉందన్నారు. బొంతపల్లిలో మత్స్యకారుల సంఘానికి ప్రత్యేక భవనం మంజూరు చేయాలని, చేపల వేట సమయంలో ప్రమాదాలకు గురయ్యే మత్స్యకార కుటుంబాలకు బీమా పథకాల ద్వారా ఆర్థిక రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్యారెడ్డి, కౌన్సిలర్లు సురభి కుమార్ గౌడ్, గిద్దె విజయలక్ష్మి, శ్రీచూర్ణం చక్రపాణి, కత్తుల రమేష్, సద్ది జైపాల్ రెడ్డి, నాయకులు ఆకుల సత్యనారాయణ, సరెడ్డి వెంకటరామిరెడ్డి, పొన్నాల శ్రీనివాసరెడ్డి, పొన్నబోయిన వేణు, గ్రామ మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

**నూతన కమిటీ సభ్యులు**

మత్స్యకారుల సంక్షేమ సహకార సంఘం అధ్యక్షుడిగా పొన్నబోయిన సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా తుజాల్పూర్ అశోక్, ప్రధాన కార్యదర్శిగా సత్తార్పు రాములు ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా తలారి శేఖర్, సత్తారపు శివ, గువ్వ సత్యనారాయణ, రామన్‌కోల్ భాగీర్తి, ఉప్పరి కిరణ్, పొన్నబోయిన శేఖర్ ఎన్నికైనట్లు నిర్వాహకులు తెలిపారు.

# గుమ్మడిదల మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

- మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేసిన మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్

**గుమ్మడిదల, మే 19 (సిరి న్యూస్ ):**



గుమ్మడిదల మున్సిపాలిటీ నూతనంగా ఏర్పాటైనప్పటికీ ప్రాథమిక మౌలిక సదుపాయాల కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ రాష్ట్ర కార్మిక, ఉపాధి, ఫ్యాక్టరీలు మరియు గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రారంభోత్సవాల సందర్భంగా మంత్రికి వివిధ అభివృద్ధి అవసరాలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గుమ్మడిదల మున్సిపాలిటీ వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్య, వైద్యం, రవాణా, క్రీడలు, గృహ నిర్మాణం వంటి కీలక రంగాల్లో మౌలిక వసతులు లేకపోవడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఐటీఐ కళాశాలతో పాటు పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రస్తుతం ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల సమగ్ర ప్రభుత్వ ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని వినతిపత్రంలో సూచించారు. పారిశ్రామిక వాడ ప్రాంతంగా గుమ్మడిదల వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయడం అత్యవసరమని తెలిపారు. యువతలో క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు క్రికెట్ మైదానం, మినీ స్టేడియం నిర్మించాలని, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కోసం గోదాములను ఏర్పాటు చేయాలని కోరారు. పేదలకు గృహ వసతి కల్పించేందుకు ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలను కేటాయించడంతో పాటు ఖాళీ స్థలం ఉన్న అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీ పరిధిలో అన్ని వర్గాల ప్రజలు వినియోగించుకునే విధంగా ఆధునిక సదుపాయాలతో కూడిన ఫంక్షన్ హాల్ నిర్మించాలని, అన్నారం నుంచి జగంపేట మీదుగా జిన్నారం వరకు ఆర్ అండ్ బి రహదారిని అభివృద్ధి చేసి కొత్త రహదారి నిర్మించాలని కోరారు. ఈ ప్రాంత అభివృద్ధి ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల, యువతకు ఉపాధి అవకాశాల సృష్టి లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన నిధులు మంజూరు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ ప్రాంత భవిష్యత్తు అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ప్రతిపాదిత పనులకు ఆమోదం తెలపాలని మంత్రిని కోరినట్లు మున్సిపల్ తెలిపారు.

# మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బండారి మహేందర్ రెడ్డి

- పట్టణ అధ్యక్షురాలుగా చింతల స్వప్న...
- 6 మండలాలకు అధికారిక కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల నియామకం..
- టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ.





**మెదక్,మే 1 9 (అవని ప్రతి నిధి)**

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బి మహేష్ కుమార్ గౌడ్ మంగళవారం నాడు మెదక్ డివిజన్లో ఉన్న అన్ని మండలాలకు, పట్టణాలకు పార్టీ అధ్యక్షులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశాను. ఈ ఉత్తర్వులు తక్షణం అమల్లోకి వస్తాయని ఆయన ప్రకటించారు. అందులో భాగంగా రామాయంపేట పట్టణానికి, మండలానికి, మిగతా మండలాలకు అధ్యక్షులను నియమించారు. అందులో భాగంగానే రామాయంపేట మండల అధికార కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మండల పరిధిలోని ఆర్. వెంకటాపూర్ గ్రామానికి చెందిన యువకుడు, ఉత్సాహ వంతుడైన మాజీ సర్పంచ్ బండారి మహేందర్ రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అదేవిధంగా పట్టణ అధ్య క్షురాలిగా చింతల స్వప్న స్వామిని నియమించారు. ఈ ఇద్దరి నియామకం ఇంతకుముందే మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు రామాయంపేట మండలంలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటుచేసి మహేందర్ రెడ్డిని అధ్యక్షుడిగా, చింతల స్వప్నను పట్టణ అధ్య క్షురాలుగా అనధికారికంగా ఎంపిక చేయడం జరిగింది. అయితే గతంలో మహేందర్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీలో కూడా మండల పార్టీ అధ్యక్షులుగా పని చేశారు. ఆ తర్వాత బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. మహేందర్ రెడ్డి ఏ పార్టీలో ఉన్న ఒక క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా ఉంటూ పలు పదవులు చేపట్టారు. మంగళవారం నాడు రామాయంపేటకు వచ్చిన మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్ రావు మహేందర్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండల సర్పంచ్ల noఫోరం ఆధ్వర్యంలో అధ్యక్షుడు మానేగళ్ళ రామ కిష్టయ్య తో పాటు పలువురు సర్పంచులు, ప్రజా ప్రతినిధులు మహేందర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పార్టీ పగ్గాలు అప్ప గించినందుకు మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావుకు, మాజీ ఎమ్మెల్యే హనుమంత రావుకు, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం, పార్టీనీ మరింత ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తానని తెలిపారు.

**పలు మండలాలకు అధ్యక్షుల నియామకం.**

టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్.మెదక్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎం నాగరాజు, హవేలీ ఘన్పూర్ మండల అధ్యక్షుడిగా G. కిరణ్ గౌడ్, పాపన్నపేట మండల అధ్యక్షుడిగా నరేందర్ గౌడ్, మెదక్ పట్టణ అధ్యక్షుడిగా ఏం గంగాధర్, చిన్న శంకరం పేట మండల అధ్యక్షుడిగా మోహన్ నాయక్, నిజాంపేట మండల అధ్యక్షుడిగా వెల్దుర్తి వెంకటేష్ గౌడ్ ను అధ్యక్షులుగా నియమిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు.




# నల్లవల్లి రైతుల భూములు కాపాడాలి

- మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి గ్రామ సర్పంచ్ కొరివి రాణి సురేష్ వినతి
- టీజీఐఐసీకి భూములు అప్పగించవద్దంటూ రైతుల తరపున విజ్ఞప్తి

**గుమ్మడిదల, మే 19 (సిరి న్యూస్):**



గుమ్మడిదల మండల పరిధిలోని నల్లవల్లి గ్రామానికి చెందిన రైతుల వ్యవసాయ భూములను తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ (టీజీఐఐసీ)కు అప్ప గించకుండా కాపాడాలని గ్రామ సర్పంచ్ కొరివి రాణి సురేష్ రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులు మరియు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి గారిని కలిసి వినతి పత్రం అందజేశారు. మంగళవారం గుమ్మడిదల మండల కేంద్రానికి వచ్చిన మంత్రి గారిని కలిసి నల్లవల్లి గ్రామంలోని సర్వే నంబర్ 142 మరియు 160లో ఉన్న వ్యవసాయ భూముల పరిస్థితిని సర్పంచ్ వివరించారు. ఇటీవల ఈ భూములను పారిశ్రామిక అవసరాల కోసం తీసుకునే దిశగా గెజిట్ వెలువడినట్లు సమాచారం రావడంతో గ్రామ రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొన్నదని తెలిపారు. గ్రామంలోని అనేక కుటుంబాలు ఈ భూములపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని, తరత రాలుగా సాగు చేసుకుంటూ కుటుంబాలను పోషిస్తున్న రైతులు ఇప్పుడు భూములు కోల్పోతామనే భయంతో ఉన్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. వ్యవసాయం ఒక్కటే ఆధారంగా జీవిస్తున్న పేద మరియు మధ్యతరగతి రైతులకు భూములు కోల్పోతే జీవనోపాధి దెబ్బతిం టుందని, వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో పడే పరిస్థితి ఏర్పడుతుందని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల జీవనాధారమైన పంట భూములను బలవంతంగా తీసుకోవడం సరైన విధానం కాదని గ్రామ ప్రజలు అభిప్రా యపడుతున్నారని తెలిపారు. రైతుల అభిప్రాయాలను పరి గణనలోకి తీసుకుని, నల్లవల్లి గ్రామంలోని సర్వే నంబర్ 142 మరియు 160 భూములను టీజీఐఐసీకి అప్పగించే ప్రక్రియను నిలిపివేసి రైతులకు న్యాయం చేయాలని మంత్రి గారిని కోరారు.రైతుల సమస్యను మంత్రి వివరించిన అనంతరం ప్రభుత్వం రైతులకు అన్యాయం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు సర్పంచ్ కొరివి రాణి సురేష్ తెలిపారు.

# మహిళల ఆరోగ్యం ప్రతి కుటుంబానికి ఎంతో ముఖ్యం

- దోమడుగులో ఉచిత రొమ్ము క్యాన్సర్ పరీక్ష శిబిరం
- 80 మంది మహిళలకు వైద్య పరీక్షలు
- మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

**గుమ్మడిదల మే 19 (సిరి న్యూస్ ):**

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు గ్రామంలో మంగళవారం ఉచిత రొమ్ము క్యాన్సర్ పరీక్ష శిబిరం నిర్వహించారు. ఏఐజి ఆసుపత్రి, తెలంగాణ ప్రభుత్వం, గ్రాన్యూల్స్ సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేశాయి. మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించడం, ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించి చికిత్స అందించడం లక్ష్యంగా ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్యా గోవర్ధన్ రెడ్డి హాజరయ్యారు. డాక్టర్ ఎస్. మధుకర్ ఆధ్వర్యంలో వైద్య బృందం మహిళలకు పరీక్షలు నిర్వహించింది. మొత్తం 80 మంది మహిళలకు పూర్తి స్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించగా, పరీక్షల నివేదికలను మూడు రోజులలో అందజేయ నున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం ప్రతి కుటుంబానికి ఎంతో ముఖ్యమని అన్నారు. రొమ్ము క్యాన్సర్ వంటి వ్యాధులను ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిస్థాయిలో నయం చేసుకోవచ్చని తెలిపారు. గ్రామీణ ప్రాంత మహిళలు ఆరోగ్య పరీక్షలను నిర్లక్ష్యం చేయకుండా ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రజల ఆరోగ్య రక్షణ కోసం మున్సిపాలిటీ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అనిశెట్టి రాజశేఖర్, మద్ది సోనీ రెడ్డి, నర్సంపల్లి రాజారెడ్డి, బ్యాగరి వరలక్ష్మి, కత్తుల రమేష్, గిద్దె విజయలక్ష్మి, జైపాల్ రెడ్డి, సురభి కుమార్ గౌడ్, చక్రపాణి, పద్మా వెంకట్రామిరెడ్డి, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మౌనిక, డాక్టర్ ప్రజ్ఞ చిగురుపాటి మరియు వారి వైద్య బృందం, హెచ్ఈఓ శ్రీనివాస్,



ఎంఎల్‌హెచ్‌పి భాగ్యలక్ష్మి, ఏఎన్ఎంలు శశికళ, ఆశా కార్యకర్తలు పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.

# ధాన్యం కొనుగోలు చేపట్టాలని రైతుల రోడ్డుపై ధర్నా..

- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులకు ఇబ్బందులు..
- జలాల్పూర్ స్టేజ్ వద్ద రోడ్డుపై బైఠాయించిన రైతులు

**వెల్దుర్తి , మే 19, (సిరి న్యూస్):**



ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించి రైతుల ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేస్తూ వెల్దుర్తి–నర్సాపూర్ ప్రధాన రహదారిపై జలాల్పూర్ స్టేజ్ వద్ద రైతులు మంగళవారం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు సక్రమంగా పనిచేయకపో వడంతో రోజుల తరబడి కొనుగోలు కోసం ఎదురుచూడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.కొనుగోలు ప్రక్రియలో జాప్యం కారణంగా వర్షాలు వస్తే ధాన్యం తడిసి నష్టపోయే ప్రమాదం ఉందని, రైతుల కష్టాన్ని ప్రభుత్వం పట్టిం చుకోవడం లేదని వారు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం, నిర్లక్ష్య వైఖరి వల్లే ఈ పరిస్థితి నెలకొందని మండిపడ్డారు.రైతుల ధర్నాకు మద్దతుగా రైతులు ఆందోళనలో పాల్గొన్నారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించి, కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని ఆలస్యం లేకుండా కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్య తెలుసుకున్న వెల్దుర్తి మండల తాహసిల్దార్ శ్రీనివాస్,ఎస్సై రాజు, సంఘటన స్థలానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పి వెనివెంటనే రైతుల వడ్లను ట్రాక్టర్లో అలాగే లారీలలో లోడ్ చేయించి వెల్దుర్తి లోని గోదాంలలో ఖాళీ చేయించారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# వైద్యుల నిర్లక్ష్యంతో 8 నెలల బాలుడు మృతి

### ఆసుపత్రి ముందు కుటుంబీకులు ఆందోళన




**నర్సాపూర్ మే 19 (సిరి న్యూస్)**



వైద్యం వికటించి ఓ పసికందు మృతి చెందిన సంఘటన మంగళవారం నర్సాపూర్ పట్టణంలోని చోటుచే సుకుంది. కుటుంబీకుల వివరాల ప్రకారం నర్సాపూర్ మండల పరిధిలోని జక్కపల్లి గ్రామానికి చెందిన మంజుల ఆంజనేయులు దంపతుల 8 నెలల పసికందు మణి వర్ధన్ కు జ్వరం రావడంతో సోమవారం మూడు గంటల సమయంలో నర్సాపూర్ పట్టణంలో అమ్మ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకు వచ్చారు. అనంతరం బాలుడికి పరీక్షలు నిర్వహించి ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకొని చికిత్సలు అందించారు మరుసటి రోజు ఉదయం వైద్యులు చూసి కసికంద మణివర్ధన్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తీసు కెళ్లాలని వైద్యులు చెప్పడంతో వెంటనే కుటుంబ సభ్యులు బాలుడిని అంబులెన్స్ సహాయంతో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు వైద్యులు పరీక్షించగా అప్పటికే బాలుడు మృతి చెందినట్లు తెలిపారు

**అమ్మ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం**

అమ్మ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ బాలుడు మృతి చెందాడని బాలునికి సరైన చికిత్స అందించక ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని సంగారెడ్డి ఆసుపత్రికి తరలించే విధంగా చేశారని కుటుంబీకులు ఆరోపించారు మణి వర్ధన్ మృతికి కారణమైన వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబీకులు ఆందోళన చేశారు ఆసుపత్రులు ఎటువంటి గొడవలు జరగకుండా ఎస్సై రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చేశారు

# తెలంగాణ రక్షణ సేన జెండా పండుగలు

### సబ్బండ కులాల రాజ్యాధికారమే టీఆర్ఎస్ ధ్యేయం.
### టీఆర్ఎస్ జిల్లా నాయకులు రమేష్ గౌడ్.



**మెదక్ మే,19(సిరిన్యూస్)**

తెలంగాణ రక్షణ సేన" భావజాలాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని తెలంగాణా రాష్ట్ర సేన జిల్లా నాయకులు వీరప్పగారి రమేష్ గౌడ్ పిలుపునిచ్చారు.నెల రోజుల పాటు వాడవాడల టిఆర్ఎస్ జెండా పండుగలు నిర్వహించలసిందిగా తెలిపారు.పార్టీ శ్రేణుల పిలుపు మేరకు నేటి నుండి జూన్ 20 వరకు రాష్ట్ర రాజధాని, జిల్లా కేంద్రాలతో పాటు నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి వరకు పెద్ద ఎత్తున టీఆర్ఎస్ జెండా పండుగ నిర్వహించాలన్నారు.అ లాగే పార్టీ ఆవిర్భావ సభలో తెలిపిన పార్టీ విధానాలను, పాంచజన్య సిద్ధాంతాలను ప్రజలకు వివరించవలసిందిగా పార్టీ నాయకులను కార్యకర్తలకు సూచించారు.నేడు తెలంగాణ ఎదుర్కుంటున్న అనేక సమస్యలపైన ఎక్కడికక్కడ గళమెత్త వలసిందిగా పార్టీ నాయకులను కార్యకర్తలకు ఇప్పటికే సూచించడం జరిగిందన్నారు.అందులో భాగంగా రాష్ట్రస్థాయి అంశాలతో పాటు స్థానిక సమస్యల పట్ల కూడా అక్కడి శ్రేణులు స్పందించడం, అవసరమైన చోట ఉద్యమించడం జరుగుతుందన్నారు.పార్టీ అధినేత కవితమ్మ ఆదేశాల మేరకు టిఆర్ఎస్ జండా పండుగలో భాగంగా కార్యకర్తలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరువ కావలసిన అవసరం వచ్చిందని కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా పిలుపు నిచ్చారు.

# మై ఫెయిర్ మార్గంలో డివైడర్ ఏర్పాటు చేయాలి

### ప్రమాదాల నివారణకు చర్యలు కోరిన స్థానికులు
### ఉప కమిషనర్ జ్యోతి రెడ్డికి వినతి పత్రం
### ట్రాఫిక్ రద్దీతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సీనియర్ సిటిజన్లు, మహిళలు

**రామచంద్రపురం, మే 19, (సిరి న్యూస్):**



తెల్లాపూర్‌లోని మై ఫెయిర్ విల్లాస్ మార్గంలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం డివైడర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం తేనా అధ్యక్షుడు రమణ ఆధ్వర్యంలో ఉప కమిషనర్ జ్యోతి రెడ్డికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా మై ఫెయిర్ విల్లాస్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ప్రతినిధులు ప్రదీప్ రెడ్డి, వీరనా రాయణ మాట్లాడుతూ మై ఫెయిర్ విల్లాస్ మార్గంలో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండటంతో సీనియర్ సిటిజన్లు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ప్రత్యేకంగా రద్దీ సమయాల్లో వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో ప్రమాదాల ముప్పు పెరుగుతోందని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని రహదారిపై డివైడర్ ఏర్పాటు చేస్తే ప్రమాదాలను నివారించడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు కూడా ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ అంశంపై తగిన చర్యలు తీసుకుంటామని ఉప కమిషనర్ జ్యోతి రెడ్డి హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు.

## ఉద్యమకారుల గుర్తింపునకు కమిటీ వేయడం పట్ల హర్షం..

**హత్నూర, మే 19,(సిరి న్యూస్)**



మలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలను అడ్డు పెట్టి పోరాడిన అసలైన ఉద్యమకారులను గుర్తించడం కోసం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి ప్రభుత్వం ప్రత్యేకంగా కమిటీ వేయడం పట్ల ఉద్యమకారులందరూ హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంపై హత్నూర మండల ఉద్యమకారుల సంఘం మండల ఉపాధ్యక్షుడు మారుతి రాజు బుధవారం ఒక ప్రకటనలో ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు తెలియజేశాడు .ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం తన వల్లే సిద్ధించిందని పదేపదే చెప్పుకొచ్చే మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు తమ పదేళ్ల పాలనలో ఏనాడు ఉద్యమకారుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని మండిపడ్డాడు .నాడు ప్రాణాలకు తెగించి రోడ్లపైకి వచ్చి ఎన్నో విధాలుగా నష్టపోయిన ఉద్యమకారులను కెసిఆర్ పట్టించుకున్న పాపాన పోలేరని విమర్శించాడు . రాష్ట్రం కోసం పోరాడిన యోధులను గత ప్రభుత్వ విస్మరిస్తే నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం గుర్తించి గౌరవించడానికి ముందుకు రావడం చాలా సంతోషకరం ఈ నిర్ణయంతో ఉద్యమకారులంతా రేవంత్ రెడ్డి రుణపడి ఉంటారనీ అన్నాడు.

## వడ్లను నిల్వ చేయుటకు ఐకెపి గోదాముల కేటాయింపు



**వెల్దుర్తి,మే19, (సిరి న్యూస్):**

జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు వెల్దుర్తి మండల కేంద్రంలోని లక్ష్మీ రైస్ మిల్ వెల్దుర్తి కి సంబంధించిన వడ్ల ను నిల్వ చేయుటకు, ఐకెపి,వెల్దుర్తి గోదామును కిరాయికి తీసుకోవడం జరిగినది. ఇట్టి గోదాం లోకి వెల్దుర్తి గ్రామంలోని వడ్లను సెంటర్ల నుండి ట్రాక్టర్ల ద్వారా లోడింగ్ చేసుకొని ఇట్టి గోధుమల వద్ద అన్లోడింగ్ చేస్తున్నామని వెల్దుర్తి తహసిల్దార్ శ్రీనివాస్ తెలిపారు.అలాగే తూప్రాన్ మండలంలోని రామయపల్లి లో వేరొక్క గోదామును మన వెల్దుర్తి మండలానికి సంబంధించిన వడ్లను నిల్వ చేయుటకు కేటాయించారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ శ్రీనివాస్, నర్సింగ్ యాదవ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీకృష్ణుడికే గురుపూజ చేయాలి

### కొత్తపల్లిలో భగవద్గీత ప్రచార కార్యక్రమం




**గుమ్మడిదల, మే 19 (సిరి న్యూస్ ):**

గుమ్మడిదల మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో భగవద్గీత అనుబంధ గ్రంథాల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల ఆశీస్సులతో ప్రచారం నిర్వహించడం జరుగుతుంది, ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రపంచానికి భగవద్గీత జ్ఞానాన్ని అందించిన శ్రీ కృష్ణుడు జగద్గురువని పేర్కొన్నారు. గురుపౌర్ణమి రోజున శ్రీకృష్ణ పరమాత్మకే గురుపూజ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ కమిటీ అధ్యక్షుడు సి.హెచ్. గిరి, సభ్యులు ఎన్.ఎస్. కుమార్, నర్సింహచారి, మధు, శ్రీనివాస్, లక్ష్మి, నరసింహారావు, రామకృష్ణ, సౌమ్య, పవన్, చంద్రకళ, పద్మ, రఫీ, సత్యనారాయణ, నాగమణి, ప్రియ, భాను, ప్రదం తదితరులు పాల్గొన్నారు.

## GO 17 రద్దు చేయాలి

### ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కాంట్రాక్టర్ల డిమాండ్

**రామచంద్రపురం (పటాన్ చెరు), మే 19 (సిరి న్యూస్):**



తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ కాంట్రాక్టుల కేటాయింపుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. పేద వర్గాలకు అవకాశాలు తగ్గిస్తున్న జీవో నెం.17ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కు, జిల్లా కలెక్టర్‌కు సంగారెడ్డి జిల్లా కన్వీనర్ కిరణ్ కుమార్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ సభ్యులు గడ్డం మల్లేశం, జాక్సన్, షామ్ తదితరులు పాల్గొని అసోసియేషన్ డిమాండ్లకు మద్దతు తెలిపారు.అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రకటించిన చేవెళ్ల, కామారెడ్డి డిక్లరేషన్లను ప్రభుత్వం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ కాంట్రాక్టుల్లో జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. తెలంగాణకు చెందిన స్థానిక కాంట్రాక్టర్లకే ప్రాధాన్యత ఇవ్వాలని, చిన్న కాంట్రాక్టర్లు కూడా టెండర్లలో పాల్గొనేలా నిబంధనలను సులభతరం చేయాలని డిమాండ్ చేశారు.అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కాంట్రాక్టర్లకు ఈఎండీ, సెక్యూరిటీ డిపాజిట్ మినహాయింపులు ఇవ్వాలని, ఎంఎస్ఎంఇ మరియు కుటీర పరిశ్రమలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# మెదక్ కాంగ్రెస్‌లో మైనంపల్లి ముద్ర..!


- **మండల, పట్టణ అధ్యక్షుల నియామకాలతో పార్టీకి కొత్త జోష్**
- **క్షేత్ర స్థాయి లో పార్టీ బలోపేతానికి చర్యలు**

**మెదక్ ప్రతినిధి,మే19(సిరి న్యూస్)**



మెదక్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆమోదంతో, మెదక్ నియోజకవర్గానికి చెందిన మండల,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులను తక్షణ అమలుతో నియమిస్తూ పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. ఈ నియామకాలు మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ సూచనల మేరకు జరగడం రాజకీయంగా ప్రాధాన్యత సంత రించుకుంది.మెదక్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ మార్పులు చేపట్టినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ముఖ్యంగా యువ నాయకత్వానికి అవకాశం కల్పించడం, పార్టీకి కట్టుబడి పనిచేసిన నేతలను గుర్తించడం, గ్రామ,మండల స్థాయిలో పార్టీ కార్యకలాపాలను మరింత చురుకుగా మార్చడమే ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశమని చెబుతున్నారు.ఇటీవల మెదక్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలు వేగవంతం అవుతున్న వేళ ఈ నియామకాలు పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. డా. మైనంపల్లి రోహిత్ నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతోందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ వ్యూహాత్మకంగా ముందుకెళ్తోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.కొత్తగా నియమితులైన మండల టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుల జాబితాలో మెదక్ మండల పార్టీ అధ్యక్షులు గా ఎం. నాగరాజు, హవేలీ ఘన్‌పూర్ అధ్యక్షులు గా గుండారం కిరణ్ గౌడ్, పాపన్నపేట అధ్యక్షులు గా నరంధర్ గౌడ్, మెదక్ పట్టణ అధ్యక్షులు గా మందు గుల గంగాధర్,చిన్న శంకరంపేట అధ్యక్షులు గా మోహన్ నాయక్, రామాయంపేట మండల అధ్యక్షులు గా బండారి మహేందర్ రెడ్డి, రామాయంపేట పట్టణ అధ్యక్షురాలిగా చింతల స్వప్న, నిజాంపేట్ అధ్యక్షులు గా మండలానికి యెల్దుర్తి వెంకటేష్‌లను నియమించారు.ఈ నియామకాలతో మెదక్ కాంగ్రెస్‌లో కొత్త రాజకీయ సమీకరణాలు ఏర్పడుతున్నాయనే చర్చ సాగుతోంది. స్థానికంగా ప్రజల్లో పట్టు ఉన్న నాయకులకు బాధ్యతలు అప్పగించడం ద్వారా పార్టీని మరింత కేడర్ ఆధారితంగా బలోపేతం చేయాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సూచనలకు అధిష్ఠానం ప్రాధాన్యత ఇవ్వడం ఆయనపై పార్టీకి ఉన్న నమ్మకాన్ని ప్రతిబింబిస్తోందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.మొత్తానికి, ఈ నియామకాలు మెదక్ కాంగ్రెస్ రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలికినట్లుగా కనిపిస్తున్నాయి. గ్రామస్థాయి నుంచి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లే దిశగా కొత్త అధ్యక్షులు ఎంతవరకు సఫలీకృతం అవుతారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



# ధాన్యం ఎక్కువ తూకం వేస్తే చర్యలు

- **లోడింగ్, ఆన్ లోడింగ్ త్వరగా కావాలి**
- **మిల్లుల దగ్గర ఆలస్యం కావద్దు**
- **ప్రతీ కేంద్రాన్ని అధికారులు పర్యవేక్షించండి**
- **జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్**

**మెదక్ ప్రతినిధి,మే19(సిరి న్యూస్)**



ధాన్యం ఎక్కువ తూకం వేస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ హెచ్చరించారు.లోడింగ్, ఆన్ లోడింగ్ త్వరగా కావాలని మిల్లుల దగ్గర ఆలస్యం కావద్దని ఆమె సూచించారు.మంగళవారం రేగోడు మండలంలో ఏర్పాటు చేసిన సొసైటీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ అసస్మికం గా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సివిల్ సప్లై, రవాణా, డిఆర్డీఓ, సహకార తదితర శాఖల అధికారులు, కొనుగోలు కేంద్ర నిర్వాహకులు సమన్వయముగా పని చేయడం తో పాటు...అధికారులు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షణ లు చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా పూర్తి అయ్యేలా బాధ్యత వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అన్నారు. కొనుగోళ్ళ ప్రభుత్వ నిబంధన లకు అనుగుణంగా కొనుగోలు కావాలని... 41 కిలోల కంటే ఒక్క గింజ ఎక్కువ తూకం వేసిన చర్యలు తప్పవని హెచ్చరించారు.సరిపడా హమాలీ లని పెట్టుకొని కాంట ప్రక్రియ త్వరగా కావాలని...ప్రతీ కేంద్రానికి సరిపడా ట్రక్ లను ఏర్పాటు చేశామని... ఆలస్యం చేయకూడదన్నారు. వెంట వెంటనే కాంట అయిన ధాన్యం ట్రక్ లోకి లోడింగ్ చేపించాలన్నారు. ట్యాబ్ ఎంట్రీ కూడా ఎప్పటికప్పుడు కావాలని... పెండింగ్ లో పెట్టకూడదన్నారు.మిల్లర్లు కూడా సరిపడా గోదాం లను ఏర్పాటు చేసుకొని....ట్రక్ లు రాగానే ఆన్ లోడింగ్ త్వరగా చేసుకోవాలన్నారు.కొనుగోలు కేంద్రాలలో ఉండే ధాన్యం త్వరగా మిల్లులకు చేరేలా సహకరించాలన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# లారీల కొరతతో అన్నదాతలు ఆందోళన

- **తూకం వేసిన ధాన్యం తరలింపులో జాప్యం**
- **ప్రభుత్వ వైఫల్యం అధికారుల నిర్లక్ష్యం**
- **రైతుల సమస్యలను గాలికి వదిలేసిన ప్రభుత్వం**
- **ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి**

**నర్సాపూర్ మే 19 (సిరి న్యూస్)**



వరి కోళ్లు కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తూకం వేసి 20 రోజులు కలుస్తున్న రైస్ మిల్లులకు ధాన్యం తరలించక పోవడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు మంగళవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించి అన్నదాతల సమస్యలను అడిగి తెలుసుకున్నారు అధికారులకు ఫోన్ చేసి లారీలను తొందరగా పంపించాలని అన్నారు ఆమె మాట్లాడుతూ సహకార సంఘం, ఐకెపి ఆధ్వర్యంలో మరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెలలు గడుస్తున్న ధాన్యం తరలింపులో జాప్యం జరుగుతుందని లారీల కొరతతో తూకం వేసిన ధాన్యం కేంద్రాలలో ఉండటంతో రైతులకు నష్టం వాటిల్లుతుందని ఎంతో కష్టపడి పండించిన పంటను అమ్ముకునే పరిస్థితి లేదని పెట్టుబడి కోసం రుణంగా ఇచ్చిన డబ్బులను ఎలా కట్టాలని రైతులు అంటున్నారు వర్షాలు కురిస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని కెసిఆర్ ప్రభుత్వం హయాంలో లారీల కొరత లేకుండా చూశారని రైతు ప్రభుత్వం చెప్పుకున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలం చెందిందని వరి కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తరలింపులో జాప్యం చేస్తుందని అన్నారు

### అధికారులతో సమావేశం

ఆర్డీవో కార్యాలయంలో మండల ఎమ్మార్వోలు, అధికారులతో సమావేశం నిర్వహించి కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యమును తొందరగా రైస్ మిల్లులకు తరలించే విధంగా ప్రయత్నం చేయాలని రైతులకు కష్టం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు




# ఆర్మ్ భారత్ ఏఐ ఛాలెంజ్"లో జాతీయ విజేతలుగా బీవీఆర్ఐటీ విద్యార్థులు







- **యాడ్ ఆస్ట్రా" సమస్య విభాగం–5లో ప్రథమ బహుమతి**

**నర్సాపూర్ మే 19, (సిరి న్యూస్):**

బెంగళూరులో జరిగిన ప్రతిష్టాత్మక సాంకేతిక పోటీలలో అద్భుతమైన విజయం సాధించడం ద్వారా బి.వి.రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులు మరోసారి జాతీయ స్థాయిలో తమ ప్రతిభను ప్రదర్శించారు. ప్రముఖ సెమీకండక్టర్ కంపెనీ ఆర్మ్ హోల్డింగ్స్ నిర్వహించిన దేశవ్యాప్త "ఆర్మ్ భారత్ ఏఐ ఛాలెంజ్"లో, కళాశాల బృందం "యాడ్ ఆస్ట్రా" సమస్య విభాగం–5లో ప్రథమ బహుమతి విజేతగా నిలిచింది.ఈ ప్రాజెక్ట్‌కు అధ్యాపక సభ్యుడు డా. యు. జ్ఞానేశ్వర చారి మార్గదర్శకత్వం వహించారు. ఆయన మార్గదర్శకత్వంలో, మూడవ సంవత్సరం ఈసీఈ విద్యార్థులు చెరళ రోహన్ కుమార్ , కార్తీక్ పాకాల అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఒక వినూత్న ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేశారు."ARM ప్రాసెసర్‌తో Xilinx Zynq FPGA పై హార్డ్‌వేర్ యాక్సిలరేటెడ్ CNN ఉపయోగించి రియల్–టైమ్ ఆబ్జెక్ట్ డిటెక్షన్" అనే శీర్షికతో ఉన్న ఈ ప్రాజెక్ట్ జాతీయ స్థాయిలో విస్తృత ప్రశంసలు అందుకుంది. జైలింక్స్ జైంక్ ఎఫ్‌పిజిఎ, ఏఆర్ఎమ్ ప్రాసెసర్‌లను ఉపయోగించి, విద్యార్థులు అత్యంత వేగవంతమైన మరియు సమర్థవంతమైన రియల్–టైమ్ ఆబ్జెక్ట్ డిటెక్షన్ సిస్టమ్‌ను అభివృద్ధి చేశారు. ఎడ్జ్‌ఏఐ , ఎంబెడెడ్ సిస్టమ్స్ రంగాలలో ఇది ఒక వినూత్న సాంకేతిక పరిష్కారమని నిపుణులు ఈ ప్రాజెక్ట్‌ను ప్రశంసించారు. శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ కె. వి. విష్ణు రాజు, వైస్ ఛైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, , కార్యదర్శి ఆదిత్య విస్సం సంస్థకు కీర్తి ప్రతిష్టలు తెచ్చినందుకు విద్యార్థులనుఅభినందించారు.విద్యార్థులకు అందించిన అద్భుతమైన ప్రయోగశాల సౌకర్యాలు జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించడానికి వారికి సహాయపడుతున్నాయని ఛైర్మన్ కె. వి. విష్ణు రాజు పేర్కొన్నారు. విద్యార్థులలో ఆవిష్కరణ , పరిశోధనలను ప్రోత్సహిస్తున్న ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాన్ని కూడా ఆయన అభినందించారు. జాతీయ స్థాయిలో కళాశాల ప్రతిష్టను పెంచిన ఈ విజయం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో పరిశోధన ఆవిష్కరణలలో రాణించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ అద్భుతమైన విజయం బి.వి. రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి మరో గౌరవం అని అన్నారు కళాశాల ప్రిన్సిపాల్ డా. సంజయ్ దుబే, డైరెక్టర్ డా. లక్ష్మీ ప్రసాద్, ఈసీఈ విభాగాధిపతి డా. సంజీవ్ రెడ్డి, కళాశాల మేనేజర్ బి. బాపిరాజు, మరియు పరిపాలనా అధికారి టి.ఎల్.ఎన్. సురేష్ విద్యార్థులను వారి అద్భుతమైన విజయానికి అభినందించారు.

# రాంరెడ్డిబావి గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

- **ఇంచార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి సర్పంచ్ సామల మైపాల్ రెడ్డి వినతి**

**గుమ్మడిదల, మే 19 (సిరి న్యూస్):**



గుమ్మడిదలలో పర్యటించిన సంగారెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని రాంరెడ్డిబావి గ్రామ సర్పంచ్ సామల మైపాల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. రాంరెడ్డిబావి గ్రామపంచాయతీ కార్యాలయ భవనం నిర్మాణానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ మైపాల్ రెడ్డి మంత్రిని కోరారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీ భవనం సౌకర్యాలు సరిపోక ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రజా సేవలను సమర్థవంతంగా అందించేందుకు నూతన భవనం అవసరమని వినతిపత్రంలో పేర్కొన్నారు. గ్రామాల మధ్య రాకపోకలకు కీలకమైన రహదారుల పునరుద్ధరణపై కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కానుకుంట నుండి సికింద్లాపూర్ వరకు, రాంరెడ్డిబావి చౌరస్తా నుండి వీరారెడ్డిపల్లి దుర్గమ్మ గుడి వయా మొల్లెగూడం నుండి కానుకుంట వరకు ఉన్న బీటీ రహదారి పూర్తిగా దెబ్బతిన్నదని తెలిపారు. రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు, విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దయనీయంగా మారి ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వెంటనే నిధులు మంజూరు చేసి రహదారి పనులు చేపట్టాలని సర్పంచ్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సమస్యలను సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా వడ్ల కొనుగోళ్లు నిర్వహించాలి

- **వడ్ల కొనుగోలు, ఉపాధి హామీ పనులు, నర్సరీలపై ప్రత్యేక దృష్టి**
- **రాంరెడ్డిబావి గ్రామంలో మండల అభివృద్ధి అధికారి ఉమాదేవి పరిశీలన**

**గుమ్మడిదల, మే 19 (సిరి న్యూస్):**



గుమ్మడిదల మండల పరిధిలోని రాంరెడ్డిబావి గ్రామపంచాయతీలో కొనసాగుతున్న వడ్ల కొనుగోలు కేంద్రం, ఉపాధి హామీ పనులు, గ్రామ నర్సరీలను మండల అభివృద్ధి అధికారి ఉమాదేవి మంగళవారం పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరును ప్రత్యక్షంగా పరిశీలిస్తూ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మండల అభివృద్ధి అధికారి రైతుల నుండి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఎలా కొనసాగుతోందో తెలుసుకున్నారు. రైతులు తీసుకొచ్చిన వడ్ల తూకం, నాణ్యత పరిశీలన, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలని అధికారులకు సూచించారు. రైతులు గంటల తరబడి వేచి ఉండకుండా తక్షణమే వడ్లు కొనుగోలు చేసి ప్రభుత్వానికి పంపే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులకు మద్దతు ధర పూర్తిస్థాయిలో అందేలా జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. పనులకు హాజరయ్యే కార్మికులకు తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. గ్రామాభివృద్ధికి ఉపయోగపడే విధంగా ఉపాధి హామీ పనులు ఉండాలని, గ్రామ శుభ్రత, మొక్కల సంరక్షణ, మట్టి పనులు వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పనుల్లో నాణ్యత ఉండాలని, కార్మికులకు సమయానికి వేతనాలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. నర్సరీలలోని మొక్కల పెంపకం తీరును పరిశీలించారు. మొక్కలను ఏ విధంగా సంరక్షిస్తున్నారో సర్పంచ్ సామల మైపాల్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పె ట్టుకొని ఎక్కువ సంఖ్యలో మొక్కలు సిద్ధం చేయాలని సూచించారు. గ్రామాల్లో పచ్చదనం పెంపొందించేందుకు నర్సరీలు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యత గ్రామపంచాయతీపై ఉందన్నారు.గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని మండల అభివృద్ధి అధికారి పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు పూర్తిస్థాయిలో చేరేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాంరెడ్డిబావి గ్రామ సర్పంచ్ సామల మైపాల్ రెడ్డి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వైస్ ఛైర్మన్ సామల దయాకర్ రెడ్డి, వార్డ్ సభ్యుడు కృష్ణ గౌడ్, సామల చంద్రారెడ్డి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను ముందు తీసుకెళ్ళాలి

**(సిరి న్యూస్):, కూకట్ పల్లి:**

పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను ముందు తీసుకెళ్ళాలని సీపీఎం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐలాపురం రాజశేఖర్ అన్నారు. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా సిపిఎం బాలానగర్ కూకట్ పల్లి మండలం ఆధ్వర్యంలో శ్రీ శ్రీనగర్ ఆఫీసులో సుందరయ్య వర్ధంతి సభ నిర్వహించి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమం లో సీపీఎం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐలాపురం రాజశేఖర్,కూకట్ పల్లి మండల కార్యదర్శి ఎం.శంకర్ పాల్గొని ప్రసంగించారు. హైదర్ అలీ ఖాన్ సుందరయ్య ని గుర్తించి పార్టీలోకి తీసుకొచ్చారని ఆ తర్వాత అమిర్ హైదర్ అలీ ఖాన్ జైలుకెళ్లాక సుందరయ్య దక్షిణ భారత దేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్వహించడంలో కీలకపాత్ర వహించారని తెలిపారు. గొప్ప పార్లమెంటేరియన్ గా శాసనసభ పక్ష నేతగా పనిచేశారని పార్లమెంట్కు అంగు,ఆర్భాటాలు లేకుండా సైకిల్ పైనే వెళ్లారని పార్లమెంట్లు అనేక విశ్లేషణలు చేశారని ఇప్పుడు ఉన్నటువంటి పాలకులు అంగుళాల పాటలతో రాజకీయాలు చేస్తున్నారని కానీ సుందరయ్య , నిరాహారతో నా జీవితాంతం ప్రజల కోసం సేవ చేశారని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై సామాన్యులపై రోజురోజుకు అనేక భారాలు మోపుతుందని పెట్రోల్,డీజిల్, గ్యాస్ ధరలు ఆకాశాలుంటాయని కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మికులకు అనేక నష్టాలకు గురి చేస్తున్నారని అన్నారు కులాలను మతాలను ఉపయోగించి ప్రజల్ని చీల్చి ఎన్నికల్లో లబ్ధి పొందుతున్నారని తెలిపారు . ఈ విధానాలపై రాబోవు కాలంలో ప్రజలందరిని కలుపుకొని ఐక్య పోరాటాలు చేయాల్సి వస్తుందని ఇదే సుందరయ్య కి నిజమైన నివాళి అని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు పి.సత్తయ్య, భీమేశ్వరరావు, ఏ.విజయ, కే కృష్ణ నాయక్, శ్రీను, రాములు బోరెల్లి, సాయి రెడ్డి, జోగారావు, కమల్ తదితరులు పాల్గొన్నారు

# ఆర్థిక సహాయం అందజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**వెల్దండ మే 19 (సిరి న్యూస్):**

వెల్దండ మండల పరిధిలోని చెర్కూర్ గ్రామానికి చెందిన బుర్ర లక్ష్మయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు మృతి చెందిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు అనంతరం మృతుని కుటుంబానికి చేయూత చేసి 20,500 వేల రూపాయలు ఆర్థిక సహాయం కాంగ్రెస్ పార్టీ నాయకులు మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు ఈ కార్యక్రమంలో కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజశేఖర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు కాటిక జంగయ్య కార్యదర్శి అల్లే బిక్షపతి కేశమోని కృష్ణయ్య నారయ్య బాలయ్య భీమరాజు బాలయ్య లవకుశ బాలకృష్ణ భీమయ్య దాసరి రమేష్ సత్యనారి జాజాల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎస్ఐని సన్మానించిన మల్లేష్ యాదవ్



**వెల్దండ మే 19 (సిరి న్యూస్):**

వెల్దండ పోలీస్ స్టేషన్ కు నూతనంగా ఎస్సైగా గంగిరెడ్డి యుగంధర్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన ఎస్సైని మర్యాద పూర్వకంగా కలిసి శాలువలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన మల్లేష్ యాదవ్ ఈ కార్యక్రమంలో యువ నాయకులు జోగు కుశ కుమార్ ముత్యం యాదవ్ శేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇతర సంస్థలలో పని చేస్తున్న రిపోర్టర్ గా అప్లై చేసిన వారి పై చర్యలు తప్పవు


**(సిరి న్యూస్): మేడ్చల్ ప్రతినిధి:**

ఇతర సంస్థలలో, ప్రభుత్వ శాఖల్లో, ప్రజా ప్రతినిధులుగా పని చేస్తూ రిపోర్టర్ గా అప్లై చేసిన వారి పై ప్రభుత్వం చీటింగ్ కింద కేసులు నమోదు చేసి తగు చర్యలు చేపడుతుందని జిల్లా పౌర సంబంధాల అధికారి తెలిపారు. ఈ సందర్భంగా 2026–28 సంవత్సరానికి గాను అక్రిడేషన్ కార్డు కొరకు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకున్న వారిలో మండలాల రిపోటర్లు ఇతర సంస్థలలో, ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్నారని మా దృష్టికి వచ్చిందన్నారు. అట్టి వారు పని చేసే సంస్థలో కానీ ప్రభుత్వ శాఖల్లో కానీ సస్పెండ్ అవుతారని తెలియజేశారు. అట్టి వారు ఇంకనూ జిల్లాలో ఎవరైనా ఉంటే తనకు తానే వచ్చి జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో చేసుకున్న దరఖాస్తును తొలగించుకోవాలని, లేని యెడల మా దృష్టికి వస్తే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లి చీటింగ్ కేసు కింద కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.

# మృతురాలి కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహాయం

**కల్వకుర్తి, మే 19 (సిరి న్యూస్):**

కల్వకుర్తి మండల పరిధిలోని తోటపల్లి గ్రామానికి చెందిన జోగు లలితమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయాన్ని బిఆర్ఎస్ గ్రామ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మంగళవారం మృతురాలి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం గ్రామ సర్పంచ్ జోగు రమణమ్మ చేతుల మీదుగా అందజేశారు. మృతురాలి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఉప్పల వెంకటేష్ తెలిపారు. కుటుంబాన్ని పరామర్శించిన వారిలో మాజీ ఎంపీటీసీ రవీందర్ రెడ్డి గ్రామ వార్డు సభ్యులు ఎజాస్, పర్వతాలు రుక్మారెడ్డి కేశవరెడ్డి ఈశ్వరయ్య వెంకటయ్య అర్జునయ్య లింగమయ్య పరశురాములు నాగార్జున బంగారయ్య సాయిలు నరసింహ బాలయ్య బంగారయ్య గ్రామ యువకులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.





# మీ జీవితానికి మీరే హీరో అవ్వండి తర్వాతే పెళ్లి..

బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ కంగనా రనౌత్ ఓవైపు రాజకీయాల్లో రాణిస్తూనే, మరోవైపు సినిమాల్లోనూ నటిస్తూ దూసుకుపోతోంది. అంతేకాకుండా సోషల్ మీడియాలో కూడా ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ, సమాజంలో జరిగే పలు విషయాలపై తనదైన శైలిలో స్పందిస్తూ ఉంటుంది. తాజాగా, కంగనా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా నేటి తరం యువతులకు కొన్ని అత్యంత కీలకమైన సూచనలు చేసింది. "ఈ రోజుల్లో ప్రతిరోజూ ఎంతోమంది వివాహితలు, యువతుల జీవితాల్లోని కష్టాలు వెలుగులోకి వస్తున్నాయి. చదువుకున్న చాలామంది యువతులు తమ జీవితాలు పూర్తిగా నాశనం కాకముందే.. ఊపిరాడనంతటి క్లిష్ట పరిస్థితుల నుండి తమను బయటపడేయమని కన్నతల్లిదండ్రులను వేడుకుంటున్నారు. కానీ, మన భారతీయ సమాజంలో కూతుళ్లకు పెళ్లి చేసిన తర్వాత వారిని పూర్తిగా వదిలివేయడంలో ఒక చెడ్డ పేరుంది" అని ఆవేదన వ్యక్తం చేసింది.

ఈ సమస్యలపై యువతులకు సలహా ఇస్తూ.. "సోషల్ మీడియా గానీ, ఫ్యాషన్, డేటింగ్, పెళ్లి లేదా మేకప్ పరిశ్రమలు ఏవీ కూడా మీకు ఈ నిజాన్ని చెప్పవు. మీ జీవితంలో మరేదాని కంటే కూడా మీ కెరీర్, మీ ఆర్థిక స్వాతంత్ర్యం చాలా ముఖ్యం. మీరు సొంతంగా నిలబడి, స్వతంత్రంగా మారిన తర్వాతే పెళ్లి గురించి ఆలోచించండి. దయచేసి మీ జీవితానికి మీరే హీరోగా మారాలి. మీరు రేపు ఎవరిని పెళ్లి చేసుకోబోతున్నారు అనే దానికంటే.. ప్రస్తుతం మీరు ఏం చేస్తున్నారు, సమాజంలో మీ గుర్తింపు ఏంటి అనేదే చాలా ముఖ్యం. మీరు కోరుకున్న జీవితాన్ని మీరే సొంతంగా నిర్మించుకోండి, ఎవరి మాటలు వినకండి" అని కంగనా రనౌత్ రాసుకొచ్చింది.

ప్రస్తుతం కంగనా చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులను కంగనా ప్రాక్టికల్‌గా చెప్పిందంటూ నెటిజన్లు ఆమెపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

# గర్ల్‌ఫ్రెండ్ అంటే బానిస కాదు!




ప్రముఖ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు దర్శకత్వంలో 'లలిత' అనే ఓ సినిమా రూపొందుతోంది. పి.సుధీర్ రాజు, డి.వైష్ణవి నేహా నిర్మిస్తున్నారు. నందిని టైటిల్ పాత్ర పోషిస్తోంది. అభిలాష్ పీలా, అఖిల్ వివాన్ హీరోలు. ఈ సినిమాని సోమవారం ప్రకటిస్తూ.. ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. తన విశ్వాసం, వ్యక్తిత్వం కోసం నిలబడే ఓ మహిళ కథగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ నేపథ్యానికి తగ్గట్లే "గర్ల్ ఫ్రెండ్ అంటే బానిస కాదు.." అనే ఉపశీర్షిక ఆసక్తిరేకెత్తిస్తోంది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడించనున్నారు. ఇందులో రఘుబాబు, పృథ్వీరాజ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తుండగా.. మణి - నాగరాజు సంగీతమందిస్తున్నారు. టి.సురేంద్ర రెడ్డి ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

# ఫ్లాప్ దర్శకుడితో చేతులు కలిపిన నాగచైతన్య.. మరోసారి భారీ రిస్క్?



అక్కినేని నాగచైతన్య 'తండేల్' సినిమాతో బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్ అందుకుని మంచి ఫామ్‌లో ఉన్నాడు. బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్ట్స్ అనౌన్స్ చేస్తూ ఫుల్ బిజీ బిజీగా గడుపుతున్నాడు. ప్రస్తుతం ఆయన 'విరూపాక్ష' చిత్రంతో సెన్సేషన్ క్రియేట్ చేసిన కార్తీక్ దండు దర్శకత్వంలో 'వృషకర్మ' అనే మైథికల్ మిస్టరీ థ్రిల్లర్ చేస్తున్నారు. ఇందులో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తుండగా.. షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇదిలా ఉంటే.. తాజాగా నాగచైతన్య నెక్స్ట్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆయన ఒక ఫ్లాప్ దర్శకుడితో సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని టాక్.

ఒకప్పుడు తనదైన మాస్, యాక్షన్ చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు పొందిన కోలీవుడ్ సీనియర్ దర్శకుడు లింగుసామి ఈ సినిమాను తెరకెక్కించబోతున్నట్లు సమాచారం. తెలుగులో రామ్ పోతినేని హీరోగా 'ది వారియర్' మూవీ తీసి భారీ డిజాస్టర్ అందుకున్న లింగుసామి.. ఇటీవల చైతు కోసం ఒక పవర్ ఫుల్ మాస్ కథను సిద్ధం చేశారట. ఆ కథ విన్న నాగచైతన్యకు బాగా నచ్చడంతో సినిమా చేయడానికి ఒప్పుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఈ కాంబినేషన్ వార్త విన్న అక్కినేని అభిమానుల్లో కాస్త ఆందోళన మొదలైంది. ఎందుకంటే, గతంలో నాగచైతన్య కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ వెంకట్ ప్రభు దర్శకత్వంలో చేసిన 'కస్టడీ' సినిమా బాక్సాఫీస్ డిజాస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఇప్పుడు మళ్లీ ఫామ్‌లో లేని మరో కోలీవుడ్ దర్శకుడు లింగుసామితో చైతు రిస్క్ చేస్తుండటంతో.. ఈసారైనా హిట్ కొడతాడా?



# మీ ఊహకు కూడా అందని కాక్‌టెయిల్ 2



వైవిధ్యమైన పాత్రలో ప్రేక్షకుల్ని అలరిస్తూ మెప్పిస్తుంటుంది కథానాయిక రష్మిక. ప్రస్తుతం ఆమె 'కాక్‌టెయిల్ 2' సినిమాతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ఆమె, హిందీ హీరో షాహిద్ కపూర్, కృతి సనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. హోమి అడజానియా దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను ఈ నెల 29న విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇటీవలే ఈ చిత్రానికి సంబంధించిన మ్యూజికల్ ఈవెంట్‌ను నిర్వహించింది చిత్రబృందం. రష్మిక మాట్లాడుతూ.. "కాక్‌టెయిల్ 2' చాలా భిన్నమైన చిత్రం. మీ ఊహకు కూడా అందదు. ముఖ్యంగా ఈ సినిమాలో కృతి అద్భుతంగా నటించింది. మాకు, షాహిద్‌కు మధ్య కెమిస్ట్రీ మరో స్థాయిలో ఉంటుంది. ఈ భిన్నమైన ప్రేమ కథను అందరూ ఎంజాయ్ చేస్తారు. ఇప్పటి వరకూ మీరు చూసింది చాలా తక్కువ. ముందు ముందు మంచి సర్‌ప్రైజ్‌లు ఉన్నాయి. వాటిని చూడడం కోసం నేను కూడా ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా" అని చెప్పుకొచ్చింది. మడాక్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం జూన్ 19న థియేటర్లలోకి రాబోతుంది.

# 'పెద్ది' ట్రైలర్‌లో.. సమంతను గుర్తు చేస్తున్న జాన్వీ

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, డైరెక్టర్ బుచ్చిబాబు సన కాంబినేషన్‌లో ముంబై వేదికగా విడుదలైన 'పెద్ది' (PEDDI) అఫీషియల్ థియేట్రికల్ ట్రైలర్ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఊరమాస్ విజువల్స్, ఏఆర్ రెహమాన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో ట్రైలర్ నెక్స్ట్ లెవెల్‌లో ఉండటంతో సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. అయితే, ఈ ట్రైలర్ బయటకు వచ్చినప్పటి నుండి మెగా ఫ్యాన్స్.. నెటిజన్లలో హీరోయిన్ జాన్వీ కపూర్ (Janhvi Kapoor) లుక్‌పై ఒక ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది.

ఈ మూవీ పూర్తి పల్లెటూరి ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామా కావడంతో.. జాన్వీ ముంబై గ్లామర్ పక్కన పెట్టి పక్కా గోదావరి లేదా రాయలసీమ రూరల్ అమ్మాయిలా మారడానికి ఆమె పడిన కష్టం విజువల్స్‌లో కనిపిస్తోంది. ముఖ్యంగా పల్లెటూరి లంగా ఓణీ కల్చర్‌తో కూడిన డీగ్లామరైజ్డ్ రూరల్ లుక్‌లో కనిపించింది. ఇక ఆమె క్యారెక్టరైజేషన్ చూసిన ఆడియన్స్‌కు వెంటనే రామ్ చరణ్ పాత ఇండస్ట్రీ హిట్ 'రంగస్థలం' గుర్తుకు వస్తోంది. దీంతో 'రంగస్థలం' సినిమాలో చరణ్ సరసన 'రామలక్ష్మి'గా సమంత పోషించిన విలేజ్ రోల్ ఎంత పెద్ద హిట్ అయిందో తెలిసిందే. ఇప్పుడు 'పెద్ది'లో జాన్వీ కపూర్ కాస్ట్యూమ్స్, ఆమె పల్లెటూరి యాటిట్యూడ్ చూస్తుంటే.. సమంత క్యారెక్టర్‌కు ఇది దగ్గరగా ఉంటుందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి.



# వీరవిహారం చేస్తున్న వీరభద్రుడు.. వర్కింగ్ డే రోజు భారీ వసూళ్లు

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, ఆర్జే బాలాజీ కాంబినేషన్‌లో వచ్చిన తాజా మాస్ యాక్షన్ డ్రామా 'కరుప్పు'. గత శుక్రవారం రిలీజ్ అయిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టిస్తోంది. మొదటి వీకెండ్ లో రూ. 147 కోట్ల గ్రాస్ రాబట్టిన ఈ సినిమా వీకెండ్ తర్వాత వచ్చే మొదటి సోమవారం టెస్ట్‌లో 'కరుప్పు' చిత్రం అద్భుతమైన వసూళ్లతో డిస్టింక్షన్ మార్కులతో పాసైంది. తమిళనాడులో ఈ చిత్రం సోమవారం నాడు కూడా డబుల్ డిజిట్ కలెక్షన్లను సాధించి ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యపరిచింది.

కేవలం తమిళనాడులోనే కాకుండా దక్షిణాది రాష్ట్రాల్లో కూడా సాలిడ్ వసూళ్లు రాబట్టింది. తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, మరియు కేరళలలో 'కరుప్పు' బాక్సాఫీస్ రన్ అద్భుతంగా సాగుతోంది. తెలుగు స్టేట్స్ లో నాలుగు రోజులకు గాను రూ. 15.50 కోట్ల గ్రాస్ రాబట్టగా రూ. 7.94 షేర్ వసూలు చేసింది. అటు కర్ణాటకలో ఫస్ట్ వీకెండ్ నాటికి రూ. 9.91 కోట్ల గ్రాస్ రాబట్టగా సోమవారం రూ. 1.67 కోట్లు రాబట్టి మొత్తంగా రూ. 11.58 కోట్ల గ్రాస్ తో సూపర్ హిట్ గా నిలిచింది. వర్కింగ్ డేస్ లో కూడా వస్తున్న ఈ సాలిడ్ హోల్డ్ చూస్తుంటే 'కరుప్పు' చిత్రం తన ఫుల్ రన్‌లో చాలా ఈజీగా రూ. 250 కోట్ల క్లబ్ వైపు దూసుకుపోతున్నట్లు ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. సూర్య నటన, కమర్షియల్ ఎలిమెంట్స్ తోడవ్వడంతో ఈ చిత్రం లాంగ్ రన్‌లో మరిన్ని సరికొత్త రికార్డులను సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది. సూర్య ఫ్యాన్స్‌కు ఇది పర్ఫెక్ట్ కమ్‌బ్యాక్ బ్లాక్‌బస్టర్ అని చెప్పొచ్చు.



The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.